ANN తెలుగు
Follow: @ANNTELUGU
06-05-2026
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 129 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మే 7న సీఎంగా విజయ్ ప్రమాణం

### ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు
### గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన విజయ్
### టీవీకే శాసనసభాపక్ష నేతగా ఎన్నిక

**చెన్నై:** ఈనెల 7వ తేదీన తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి విజయ్.. ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారు. గురువారం రోజున చెన్నై సెంట్రల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అంగరంగ వైభవంగా ఈ పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం టీవీకే పార్టీ నేతలు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. తమిళగ వెట్రి కళగం శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ అధినేత విజయ్ మంగళవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ అభ్యర్థులతో టీవీకే కార్యాలయంలో విజయ్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో లెజిస్లేటివ్ పార్టీ నేతగా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాల్లో విజయం సాధించింది. మెజారిటీకి మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా ఉందని తెలుస్తోంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రమంత్రులతో భేటీలు
- కాంగ్రెస్ పెద్దలను కలిసే అవకాశం

02

### నెల్లూరు జిల్లాలో టీడీపీ మహానాడు
- మే 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు నిర్వహణ

02



### విజయ్ కే కాంగ్రెస్ జై
- తమిళనాడులో మద్దతు
- ఏఐసీసీ నిర్ణయం

02

# తెలుగునాట విజయ్ ఎవరు?

## సింగిల్ షాట్‌తో సీఎం పీఠంపై గురి
### నెట్టింట హోరెత్తుతున్న విశ్లేషణలు

- ఎన్టీఆర్ ప్రభంజనం నుండి రేవంత్ రెడ్డి యుక్తి వరకు
- సాహసోపేత నేతలకే జై కొడుతున్న ప్రజలు
- పార్టీ పెట్టి.. బంపర్ విక్టరీ సాధించే సామర్థ్యం ఎవరికి ఉందంటూ ఊహాగానాలు
- అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, హరీష్ రావు, ఈటల రాజేందర్ లపై చర్చ
- స్క్రీన్ హీరోస్ వర్సెస్ పొలిటికల్ వారియర్స్


**హైదరాబాద్ మహా:** తమిళనాట 'తమిళగ వెట్రి కజగం' ద్వారా దళపతి విజయ్ సృష్టించిన సంచలనం, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. పాలిటిక్స్ అంటేనే ఒక చదరంగం, అందులో "విజయ్" లాగా సింగిల్ షాట్‌తో సీఎం పీఠాన్ని అందుకునే దమ్ము ఎవరికి ఉంది? అనే ప్రశ్నపై నెట్టింట విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటు స్క్రీన్ హీరోస్, అటు పొలిటికల్ హీరోస్ పై తమ అంచనాలు వెల్లడిస్తున్నారు. ఎన్టీఆర్, కేసీఆర్, వైఎస్ జగన్ లాంటి నేతలు తెలుగు నేలపై స్పెషల్ రికార్డ్ క్రియేట్ చేశారు. కేసీఆర్ ను ఓడించి రేవంత్ రెడ్డి, చంద్రబాబును ఓడించి జగన్ ఇదే తరహా ఫీట్ చూపారు. ఇపుడు తెలుగునేలపై కొత్తపార్టీలకు స్పేస్ ఉందా? స్పేస్ క్రియేట్ చేసుకుని వస్తే గెలిచేస్తారా? సామాజిక మాధ్యమాల్లో రకరకాల లెక్కలున్నాయి. ఇపుడున్న పరిస్థితుల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ లకు సినీరంగం నుండి ఛాన్స్ ఉందని, రాజకీయ రంగంలో తన్నీరు హరీష్ రావు, ఈటల రాజేందర్ లకు కూడా పార్టీ పెట్టి సీఎం అయ్యే సామర్థ్యం ఉందని విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే కవిత తెలంగాణకు తొలి మహిళా సీఎం కావాలని.. పార్టీని ప్రకటించారు. నెటిజన్ల లెక్కలు ఎలా ఉన్నా, రాజకీయాల్లో "ప్రజల ఆశీస్సులు సరైన సమయం" కలిసొచ్చిన రోజే ఎవరైనా సీఎం పీఠాన్ని అధిరోహించగలరు. కేటీఆర్, లోకేష్ లాంటి నేతలు ఇప్పటికే వారసులుగా తమ సమర్థతను చాటుకున్నారు.




1 జూనియర్ ఎన్టీఆర్



2 అల్లు అర్జున్



3 తన్నీరు హరీష్ రావు



4 ఈటల రాజేందర్



5 కల్వకుంట్ల కవిత

### పోలరైజ్ పాలిటిక్స్

- విజయ్ విజయం వెనుక "సరైన సమయం
- బలమైన అభిమాన గణం
- రాజకీయ శూన్యం" అనే మూడు సూత్రాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం రాజకీయాలు చాలా పోలరైజ్ అయి ఉన్నాయి



### డేరింగ్ & డాషింగ్

డేరింగ్ అండ్ డాషింగ్ లీడర్లను తెలుగునాట ఎపుడూ ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. ఒక నాడు ఎన్టీఆర్.. దేశంలోనే ప్రభంజనమయ్యారు. ఐరన్ లేడీ ఇందిరను ఎదిరించి టీడీపీని స్థాపించి సీఎం అయ్యారు. తర్వాత కేసీఆర్ టీఆర్ఎస్ స్థాపించి తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమాన్ని నడపడమే కాక, సాధించిన రాష్ట్రానికి తొలి సీఎం అయ్యారు. పదేళ్ళు పాలించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో జగన్ ముప్పేట దాడిని ఎదుర్కొని పొత్తుల్లేకుండా డేరింగ్ అండ్ డాషింగ్ గా దూసుకెళ్ళి సీఎం అయ్యారు. తెలంగాణలోనూ బలమైన శక్తిగా ఉన్న కేసీఆర్ ను ధీటుగా ఎదుర్కొని.. తన యుక్తితో, డేరింగ్ అండ్ డాషింగ్ పాలిటిక్స్ చేసి రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. ఎలాంటి పరిస్థితులనైనా ధీటుగా ఎదుర్కొనే నేతలు, ప్రజలతో కనెక్టివిటీ ఉన్నవారు, ప్రజల కోణంలో ఆలోచించేవారు, క్లీన్ పాలిటిక్స్ చేసేవారికి ప్రజలు ఎపుడూ అండగా ఉంటారని చరిత్ర చెబుతోంది.

## మే10న కేరళ సీఎం ప్రమాణస్వీకారం?

### నేడో రేపో ఫైనల్ చేయనున్న కాంగ్రెస్ హైకమాండ్
### రేసులో వీడీ సతీషన్ కేసీ వేణుగోపాల్




**తిరువనంతపురం:** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించడంతో కొత్త ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియ వేగవంతమైంది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియాగాంధీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎంపికపై ఫోకస్ పెట్టారు. కాంగ్రెస్ హైకమాండ్ ముఖ్యమంత్రి అభ్యర్థిపై రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటుందని కీలకనేత వి.డి. సతీషన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానం మిత్రపక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, పార్టీలో అంతర్గత విభేదాలు రాకుండా తుది నిర్ణయం ప్రకటించనుంది. నేడో, రేపో కాంగ్రెస్ హైకమాండ్ ఫైనల్ చేయనుంది. ముఖ్యమంత్రి రేసులో ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉండి, పార్టీని విజయపథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించడంతో వి.డి. సతీషన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.కె.సి. వేణుగోపాల్ పేరు హైకమాండ్ అండదండలతో సీఎం రేసులో బలంగా వినిపిస్తోంది. రమేష్ చెన్నితాల సీనియర్ నేతగా తనకూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రధానంగా వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్ మధ్య ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యేలలో సతీషన్ కు ఎక్కువ మద్దతు లభించే అవకాశముంది. మే 10న కేరళ కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ప్రమాణస్వీకారం చేసే అవకాశం కనబడుతోంది.

## విజయ్ విజయం ముందే

### ఏఎన్ఎన్ సర్వే సంచలనం

52 శాతం మంది మొగ్గు విజయ్ వైపే
లక్షమందికి పైగా అభిప్రాయం
ద్రవిడ కోటల పతనాన్ని ఆరు రోజుల ముందే పసిగట్టిన సర్వే
సోషల్ మీడియా పోల్‌తో పొలిటికల్ సెన్సేషన్




**హైదరాబాద్, మహా:** తమిళనాడు రాజకీయ ముఖచిత్రం ఏ విధంగా మారబోతోందో ఆరు రోజుల క్రితమే 'ఏఎన్ఎన్ తెలుగు' నిర్వహించిన ఒక డిజిటల్ సర్వే కళ్లకు కట్టినట్లు చూపించింది. ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్న తరుణంలో, ఛానల్ నిర్వహించిన పోల్‌లో ప్రజలు తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. మే 4 న వెలువడిన ఫలితాలు, ఆనాడు ఏఎన్ఎన్ ఛానల్ నిర్వహించిన సర్వే అంచనాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండటం గమనార్హం. దళపతి విజయ్ రాజకీయ అరంగేట్రం కేవలం ఒక అల కాదని,

మిగతా 2లో

## మే 10న భాగ్యనగరం సాక్షిగా మోదీ సమర శంఖం



- మూడోసారి పగ్గాలు చేపట్టాక తొలిసారి తెలంగాణకు
- మమత, రాహుల్ తీరుపై నిప్పులు
- ఓటమి పాలైతే ప్రజలను నిందిస్తారా?
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, మహా:** మే 10న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభ కోసం బీజేపీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధమవుతున్నాయి. ఈ సన్నాహకాల్లో భాగంగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మంగళవారం తార్నాకలో నిర్వహించిన 'వాల్ రైటింగ్' క్యాంపెయిన్‌లో స్వయంగా పాల్గొన్నారు. గోడపై కమలం పువ్వును చిత్రించి, ప్రధాని సభకు ప్రజలను ఆహ్వానిస్తూ

మిగతా 2లో



## నెరవేరిన ఉత్తరాంధ్ర దశాబ్దాల కల

### విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్
### జూన్ 1 నుంచి ప్రారంభం..! గెజిట్ విడుదల




**ఢిల్లీ, మహా :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా కొత్తగా ఏర్పడిన 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' కార్యకలాపాలపై కేంద్ర రైల్వే బోర్డు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026 జూన్ 1 నుంచి ఈ కొత్త జోన్ అధికారికంగా అమల్లోకి రానుంది. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ (రైల్వే బోర్డు) మే 4, 2026న ఈ మేరకు

మిగతా 2లో




# తెలుగునాట విజయ్ ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

**ఎవరెవరికి ఛాన్స్?**

**1. జూనియర్ ఎన్టీఆర్**

తెలుగు రాష్ట్రాల్లో 'సింగిల్ షాట్' సీఎం అయ్యే క్రేజ్, కెపాసిటీ ఎవరికైనా ఉందంటే అది మొదటగా ఎన్టీఆర్ పేరునే వినిపిస్తుంది.

**బలం:**

తాతకు తగ్గ మనవడిగా అద్భుతమైన వాగ్ధాటి . భావోద్వేగాలను పండించడంలోనూ, జనాన్ని తన మాటలతో కట్టిపడేయడంలోనూ ఆయన సిద్ధహస్తుడు.

**అవకాశం:**

విజయ్ లాగా సొంత పార్టీ పెడతారా లేదా టీడీపీ బాధ్యతలు తీసుకుంటారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో బలమైన రాజకీయ పార్టీలు ఉండటం. అయితే, యువతలో ఆయనకున్న క్రేజ్ సరికొత్త 'పొలిటికల్ స్పేస్'ను సృష్టించగలదు.

**అల్లు అర్జున్**

'పుష్ప' చిత్రంతో గ్లోబల్ బ్రాండ్‌గా మారిన అల్లు అర్జున్, ఇప్పుడు కేవలం నటుడు మాత్రమే కాదు, ఒక సామాజిక శక్తి.

**బలం:**

అపారమైన యూత్ ఫాలోయింగ్. కుల, ప్రాంతీయ బేధాలు లేకుండా యువతలో ఆయనకు ఉన్న క్రేజ్ ఎన్నికల్లో ఓట్ల వర్షం కురిపించగలదు. సోషల్ మీడియాలో ఆయనకున్న పట్టు ప్రత్యర్థులకు సవాలే. తనకంటూ ఒక ప్రత్యేకమైన 'స్టైలిష్' పంథాను రాజకీయాల్లోనూ చూపిస్తారనే నమ్మకం అభిమానుల్లో ఉంది. ఇటీవల ఆయన చేసిన కొన్ని రాజకీయ వ్యాఖ్యలు, పర్యటనలు ఆయన పొలిటికల్ ఎంట్రీపై అంచనాలను పెంచేశాయి

**అవకాశం:**

పవన్ కళ్యాణ్ లాగా 'మార్పు' అనే నినాదంతో వస్తే, కొత్త ఓటర్లను ఆకర్షించే సత్తా ఆయనకు ఉంది. సినిమా గ్లామర్ ఓట్లుగా మారుతుందా అనేది ఎప్పుడూ ఒక ప్రశ్నార్థకమే, కానీ బన్నీకి ఉన్న 'కనెక్టివిటీ' సామాన్య ప్రజల్లో బలంగా ఉంది.

**తన్నీరు హరీష్ రావు**

రాజకీయ క్షేత్రంలో హరీష్ రావు ఒక 'అపర చాణక్యుడు'. గ్రౌండ్ లెవల్ పాలిటిక్స్ ఆయనకు కొట్టిన పిండి.

**బలం:**

ట్రబుల్ షూటర్ గా పేరున్న హరీష్ రావుకు కార్యకర్తల మనసు గెలుచుకోవడం తెలుసు. అడ్మినిస్ట్రేటివ్ పరంగా ఆయనకు ఉన్న అనుభవం, ప్రజల్లో ఉన్న నమ్మకం ఆయన పెద్ద ప్లస్ పాయింట్స్.

**అవకాశం:**

తెలంగాణ రాజకీయాల్లో భవిష్యత్తులో ఏర్పడే శూన్యాన్ని భర్తీ చేయడంలో ఆయన పాత్ర కీలకం. ఒకవేళ సొంతంగా అడుగు వేస్తే, ఆయనకు ఉన్న కేడర్ బలం అసాధారణం. తెలంగాణ రాజకీయాల్లో ఏదైనా భారీ మార్పు సంభవిస్తే, తనకంటూ ఒక సొంత ఇమేజ్ ఉన్న హరీష్ రావు వైపు జనం చూసే అవకాశం మెండుగా ఉంది.

**ఈటల రాజేందర్**

తెలంగాణ ఉద్యమ కాలం నుండి ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన నేత ఈటల.

**బలం:**

బిసి అస్త్రం మరియు అణగారిన వర్గాల ప్రతినిధిగా ఆయనకు ఉన్న ఇమేజ్. హుజూరాబాద్ గెలుపు ద్వారా ఆయన తన వ్యక్తిగత బలాన్ని నిరూపించుకున్నారు.

**అవకాశం:**

తెలంగాణాలో ఒక బలమైన 'థర్డ్ ఫోర్స్' లేదా కొత్త కూటమి ఏర్పడితే, దానికి నేతృత్వం వహించే అర్హత ఆయనకు ఉంది. కేవలం ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్త నేతగా ఎదిగే లక్షణాలు ఆయనలో ఉన్నాయి.

**కల్వకుంట్ల కవిత**

తెలంగాణలో మహిళా ఓటర్లను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలను ప్రభావితం చేయగల నేతగా కవితకు గుర్తింపు ఉంది. కవిత తాజాగా టీఆర్ఎస్ పార్టీని ప్రకటించారు.

**బలం:**

సాంస్కృతిక వారసత్వం. బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తం చేయడంలో ఆమె పాత్ర, తెలంగాణ సెంటిమెంట్‌ను బలంగా వినిపించే తీరు ఆమెకు ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. భవిష్యత్తులో మహిళా ప్రాధాన్యత ఉన్న రాజకీయ వేదికలపై ఆమె కీలక పాత్ర పోషించవచ్చు.

**అవకాశం :**

రాజకీయాల్లో ఒడిదుడుకులు సహజం. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్ని న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పటికీ, ఒక మాస్ లీడర్‌గా తిరిగి పుంజుకునే సత్తా ఆమెలో ఉంది. సంక్షేమ పథకాలు, మహిళా సాధికారత అనే నినాదాలతో ప్రజల్లోకి వెళ్తే "విమెన్ పవర్" అనేది కేవలం స్లోగన్ మాత్రమే కాదు, ఒక బలమైన ఓటు బ్యాంకుగా మారుతుంది. తనకున్న "సాంస్కృతిక బలాన్ని" "రాజకీయ బలంగా" ఎంతవరకు మలుచుకుంటారో వేచి చూడాలి.

# విజయ్ విజయం ముందే

## ఏఎన్ఎన్ సర్వే సంచలనం

(మొదటిపేజీ తరువాయి)

అది ద్రవిడ రాజకీయాలను ముంచెత్తబోతున్న సునామీ అని ఈ సర్వే ముందే హెచ్చరించింది.

**విజయ్ వైపే 52 శాతం మొగ్గు.. తిరుగులేని ఆధిక్యం**

"తమిళనాడు సీఎం ఎవరు అవుతారు..?" అంటూ ఏఎన్ఎన్ ఛానల్ వేసిన ప్రశ్నకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఏకంగా 52 శాతం మంది తమ ఓటు దళపతి విజయ్‌కేనని స్పష్టం చేశారు. అంటే సగానికి పైగా ప్రజలు విజయ్ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని ఈ ఫలితం వెల్లడించింది. ఇన్నాళ్లూ కేవలం సినిమా గ్లామర్ అనుకున్న విశ్లేషకులకు, ఈ సర్వే ఫలితం ఒక కనువిప్పులా మారింది. విజయ్ పట్ల ఉన్న ఈ తిరుగులేని ఆదరణే నేడు ఆయనను సింగిల్ లార్జెస్ట్ పార్టీ అధినేతగా నిలబెట్టిందని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

**కుదేలైన స్టాలిన్ గ్రాఫ్.. తగ్గిన అన్నాడీఎంకే ప్రభావం**

ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను కూడా ఈ సర్వే స్పష్టంగా ఎండగట్టింది. స్టాలిన్ ముఖ్యమంత్రిగా తిరిగి రావాలని కేవలం 38 శాతం మంది మాత్రమే కోరుకున్నారు. అధికార పార్టీ పట్ల ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తికి ఇది అద్దం పట్టింది. మరోవైపు, అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి కేవలం 9 శాతం ఓట్లతో మూడో స్థానానికి పరిమితం కావడం విశేషం. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలిన రెండు ప్రధాన పార్టీల కంటే విజయ్ పట్ల ప్రజలు ఎందుకు ఆకర్షితులయ్యారో ఏఎన్ఎన్ సర్వే ఆరోజే విశ్లేషించింది.

**లక్ష మంది ఓటర్ల సాక్షిగా.. ఖచ్చితమైన విశ్లేషణ**

సాధారణంగా ఏదైనా సర్వేలో కొన్ని వేల మంది పాల్గొనడమే కష్టమైన పని. కానీ ఏఎన్ఎన్ నిర్వహించిన ఈ పోల్‌లో ఏకంగా ఒక లక్షా ఏడు వేల మంది (107K) పాల్గొనడం అందరినీ విస్మయానికి గురి చేసింది. ఇంత భారీ స్థాయిలో ప్రజలు ఒక సర్వేలో భాగస్వాములు కావడం అంటే, అది రాష్ట్రంలో నెలకొన్న మార్పు కాంక్షకు నిదర్శనం. లక్ష మంది ప్రజల అభిప్రాయం ఎప్పుడూ తప్పు కాదని, వారి నాడిని పసిగట్టడంలో ఏఎన్ఎన్ ఛానల్ అత్యంత విజయవంతమైందని నేడు రుజువైంది. ప్రజల ఆలోచనా దృక్పథం ముందే పసిగట్టి, విజయ్ ముఖ్యమంత్రి కావడానికి ఉన్న అవకాశాలను ఈ ఛానల్ ముందే విశ్లేషించింది.

**మార్పు కోరుతున్న యువత, మహిళా ఓటర్లు**

విజయ్ కు లభించిన ఈ 52 శాతం ఓట్ల వెనుక ఒక బలమైన కారణం ఉంది. ప్రధానంగా యువత మరియు మహిళా ఓటర్లు ద్రవిడ పార్టీల అవినీతి, పాతకాలపు రాజకీయాలకు స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నారు. తమకు ఒక నూతన నాయకత్వం కావాలని, అది విజయ్ రూపంలో సాధ్యమవుతుందని వారు నమ్ముతున్నారు. ఏఎన్ఎన్ సర్వేలో వెల్లడైన ఈ గణాంకాలు.. కేవలం అంకెలు మాత్రమే కాదని, అవి తమిళనాడు భవిష్యత్తు కోసం ప్రజలు చేస్తున్న నిశ్శబ్ద పోరాటమని ఆనాడే స్పష్టమైంది.

**ముందే ఊహించిన 'విజయ'దుందుభి**

ఏఎన్ఎన్ ఛానల్ ఆరు రోజుల ముందే విజయ్ విజయాన్ని ముందే ఊహించి, దాన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలకు చేరవేసింది. ఎవరూ ఊహించని విధంగా విజయ్ పట్ల 52 శాతం మంది సానుకూలత వ్యక్తం చేయడం అనేది తమిళ రాజకీయాల్లో ఒక మైలురాయి. నేడు విజయ్ పార్టీ టీవీకే 108 స్థానాల్లో గెలుపొంది, ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవ్వడం వెనుక ఈ సర్వేలో కనిపించిన ప్రజాభిప్రాయమే కీలక భూమిక పోషించింది. మీడియా రంగంలో ఏఎన్ఎన్ ఛానల్ నిర్వహించిన ఈ సర్వే ఒక మైలురాయిగా మిగిలిపోనుంది.

# మే 7న సీఎంగా విజయ్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

విజయ్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి కాంగ్రెస్, పీఎంకే సిద్ధంగా ఉన్నాయి.

**మహాబలిపురం రిసార్ట్ లో క్యాంప్**

హంగ్ అసెంబ్లీ ఏర్పడిన తరుణంలో ఎమ్మెల్యేల కొనుగోళ్లు, ప్రలోభాలకు తెరతీసే అవకాశం లేకుండా విజయ్ క్యాంప్ రాజకీయాలు షురూ చేశారు. గెలిచిన 108 మంది టీవీకే ఎమ్మెల్యేలను నేరుగా మహాబలిపురంలోని ఒక లగ్జరీ రిసార్టుకు తరలించి క్యాంపు ఏర్పాటుచేశారు. స్వయంగా క్యాంపును పర్యవేక్షిస్తున్న విజయ్, ఎమ్మెల్యేల్లో ఎవరికీ ఎలాంటి అసంతృప్తి రాకుండా వారితో నిరంతరం మాట్లాడుతూ పార్టీ ఐక్యతను కాపాడుకునేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

# విజయ్ కే కాంగ్రెస్ జై

**మహా:** తమిళనాడులో టీవీకే కు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని విజయ్ కోరారు. లౌకిక ప్రభుత్వ ఏర్పాటు, రాజ్యాంగ పరిరక్షణ కోసం తమిళనాడు ప్రజలు తీర్పు ఇచ్చారు. టీవీకే విజ్ఞప్తి మేరకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని తమిళనాడు కాంగ్రెస్ నేతలకు స్పష్టం చేశామని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. దీంతో విజయ్ కు లైన్ క్లియర్ అయిపోయింది.

# మే 9న బెంగాల్ బీజేపీ సర్కార్

## చాణక్యుడు అమిత్ షాకే సీఎం ఎంపిక బాధ్యత.. సువేందు అధికారికే ఛాన్స్ ?

**ఢిల్లీ, మహా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన అఖండ విజయంతో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు కమలదళం ముహూర్తం ఖరారు చేసింది. బెంగాలీల సాంస్కృతిక వారసత్వాన్ని, సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకుని మే 9వ తేదీన అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించేందుకు పార్టీ అధిష్టానం భారీ స్థాయిలో సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎంచుకున్న తేదీ వెనుక బీజేపీ భారీ వ్యూహమే దాగి ఉంది. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని బెంగాల్ వ్యాప్తంగా ఘనంగా జరుపుకునే 'పొచిశే బోయ్‌షేక్' సాంస్కృతిక వేడుకల రోజే నూతన ప్రభుత్వం కొలువుదీరనుంది. బెంగాల్ ప్రజల గుండెల్లో రవీంద్రుడికి ఉన్న అత్యున్నత స్థానాన్ని, వారి సాంస్కృతిక మూలాలను గౌరవిస్తూ, తాము కూడా బెంగాల్ మట్టి బిడ్డలమే అనే బలమైన సందేశాన్ని పంపేందుకే బీజేపీ ఈ చారిత్రక రోజును ఎంచుకుంది. జాతీయ అగ్రనేతలు, దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ముఖ్యమంత్రులు, మేధావుల సమక్షంలో ఈ వేడుకను అద్భుతంగా నిర్వహించి, బెంగాల్ అభివృద్ధిలో ఒక సరికొత్త శకానికి నాంది పలకాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



### అమిత్ షాకు బాధ్యత

బెంగాల్ సీఎం ఎంపిక బాధ్యత కేంద్ర హోంమంత్రి, రాజకీయ చాణక్యానికి మారుపేరుగా నిలిచే అమిత్ షా కు అప్పగించారు. ఖ్యమంత్రి పదవికి సువేందు అధికారి పేరును అధిష్టానం దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఒకప్పుడు దీదీకి కుడిభుజంగా ఉండి, ఆ తర్వాత బీజేపీలో చేరి పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమించిన సువేందుకే కమలనాథులు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అజేయ నాయకురాలిగా పేరుతెచ్చుకున్న మమతా బెనర్జీని నందిగ్రామ్ లాంటి కీలక నియోజకవర్గంలో ఓడించిన నాయకుడిగా సువేందు అధికారికి పార్టీలో, ప్రజల్లో తిరుగులేని ఇమేజ్ ఏర్పడింది. బెంగాల్ రాజకీయాల్లో మమతను రెండుసార్లు ఓడించిన ఏకైక నాయకుడిగా సువేందు సాధించిన రికార్డు ఆయనను ముఖ్యమంత్రి రేసులో అందరికంటే ముందు నిలబెట్టింది. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేయడంలో, అధికార పార్టీ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టడంలో సువేందు కనబరిచిన ధైర్యసాహసాలకు జాతీయ నాయకత్వం అబ్బురపడింది. రాష్ట్ర నలుమూలలా బలమైన క్యాడర్ ఉన్న సువేందు చేతికి పగ్గాలు అప్పగిస్తే రాబోయే రోజుల్లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయవచ్చని బీజేపీ పెద్దలు లెక్కలు వేస్తున్నారు. రవీంద్రుడి జయంతి సాక్షిగా, బెంగాల్ ప్రజల ఆశీస్సులతో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం లాంఛనమేనని రాజకీయ పరిశీలకులు సైతం స్పష్టం చేస్తున్నారు. పలువురు మహిళానేతలు సైతం రేసులో ఉన్నారు.

# నెరవేరిన ఉత్తరాంధ్ర దశాబ్దాల కల

(మొదటిపేజీ తరువాయి)

అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 1989 రైల్వే చట్టంలోని సెక్షన్ 3(4) ప్రకారం కొత్త రైల్వే జోన్‌గా 'సౌత్ కోస్ట్ రైల్వే' ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. జూన్ 1, 2026 నుండి తన కార్యకలాపాలను ప్రారంభిస్తుందని వెల్లడించింది. విశాఖపట్నం ప్రధాన కార్యాలయంగా పనిచేసే ఈ జోన్ పరిధిలోకి పలు కీలక విభాగాలు చేర్చారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లు పూర్తిగా దక్షిణ తీర రైల్వే జోన్ పరిధిలోకి వస్తాయి. రాయగడ డివిజన్‌లో ఇంతకుముందున్న పలాసఇచ్ఛాపురం రైల్వే లైన్, ఇచ్ఛాపురం దువ్వాడ విజయనగరం రైల్వే లైన్లు విశాఖ డివిజన్‌లోకి వచ్చాయి. నౌపడా పర్లాకిమిడి బొబ్బిలి సాలూరు లైన్లు, సింహాచలం వడ్లపూడి విశాఖ జగ్గయ్యపాలెం రైల్వే లైన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేశారు. కోరాపుట్‌కిరండోల్ లైన్‌ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించారు. రాయగడలో ఏర్పాటు చేసే కొత్త డివిజన్‌లో కోరాపుట్-సింగపూర్ రోడ్, కొత్తవలస-కిరండూల్, కునేరు-థెరువలి, గుణుపూర్-పర్లకిమిడి వంటి మార్గాలు చేరనున్నాయి. ఈ డివిజన్ మొత్తం 696 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంటుంది. అదనంగా పలాసా-ఇచ్ఛాపురం మార్గాన్ని ఖుర్దా రోడ్ డివిజన్ నుంచి విశాఖ డివిజన్‌కు బదిలీ చేశారు. ఆరిలోవలో దక్షిణ కోస్తా రైల్వే శాశ్వత కార్యాలయ నిర్మాణం చేపట్టనున్నారు. వీఎంఆర్‌డీఏ డెక్‌లోని 2 అంతస్తుల్లో దక్షిణ కోస్తా రైల్వే జీఎం తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇటీవలనే ఈ ఆఫీస్ ను కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సందర్శించారు. సికింద్రాబాద్ ప్రధాన కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే నుంచి హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు అలాగే కొనసాగుతాయి. అయితే విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఇకపై విశాఖపట్నం కేంద్రంగా ఉన్న దక్షిణ తీర రైల్వే జోన్ ఆధీనంలోకి వస్తాయి. ఈ మార్పుతో రాష్ట్రంలోని రైల్వే సరిహద్దుల్లో మార్పులు రానున్నాయి. ఈ జోన్ కార్యకలాపాలకు కీలక అధికారుల నియామకం ఇప్పటికే పూర్తయింది. ఇతర సిబ్బందిని కూడా సర్దుబాటు చేస్తున్నారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటుపై 2019 ఫిబ్రవరిలో కేంద్రం ప్రకటన చేసింది. తర్వాత అది ముందుకు సాగలేదు. చివరికి 2025 జనవరిలో డీపీఆర్‌కు ఆమోదం తెలిపి అదే నెలలో జోనల్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఎంతో కీలకమైన గెజిట్ నోటిఫికేషన్ రాకపోవడంతో అధికారిక కార్యకలాపాలు అమల్లోకి రాలేదు. అయితే జూన్ 1 నుంచి అమల్లోకి వస్తూ గెజిట్ విడుదలైన నేపథ్యంలో అధికారికంగా కార్యక్రమాలు మొదలవుతాయి. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రైల్వే జోన్ డిమాండ్ నెరవేరడం పట్ల ఉత్తరాంధ్ర వాసులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.


**మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హర్షం**

రైల్వే జోన్ పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. “ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సానుకూల నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు కావడం ఏపీ ప్రజల చిరకాల స్వప్నం. సీఎం చంద్రబాబు కృషితోనే ఇది సాకారమైంది జూన్ 1, 2026 నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభం కావడంతో.. రాష్ట్ర రవాణా రంగంలో నవశకానికి నాంది పలకనుంది. ఎన్నో ఏళ్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల కల నెరవేరుస్తూ విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కావడం చారిత్రాత్మక నిర్ణయం” అని ఆయన పేర్కొన్నారు.

# నెల్లూరు జిల్లాలో టీడీపీ మహానాడు

## మే 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు నిర్వహణ

**నెల్లూరు, మహా:** తెలుగుదేశం పార్టీ వార్షిక మహానాడుకు వేదిక, తేదీలు ఖరారయ్యాయి. ఈ ఏడాది మహానాడును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. మే 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. పార్టీ చరిత్రలో నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించడం ఇదే ప్రథమం. మహానాడు వేదికగా నెల్లూరు జిల్లాలోని కొడవలూరు మండలంలో ఉన్న ఇఫ్కో కిసాన్ స్పెషల్ ఎకనామిక్ జోన్ ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. ఈ నెల 6వ తేదీన మహానాడు పనులకు భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మందికి పైగా పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఇఫ్కో సెజ్‌లో దాదాపు 150 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. మంత్రులు పి. నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి సహా పలువురు సీనియర్ నేతల బృందం జిల్లాలోని పలు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం, తుది నిర్ణయం తీసుకుని ఈ వేదికను ఖరారు చేసింది. భూమిపూజ అనంతరం సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, ఇతర సౌకర్యాల కోసం ఏర్పాట్లను వేగవంతం చేయనున్నారు.



# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

## కేంద్రమంత్రులతో భేటీలు

## కాంగ్రెస్ పెద్దలను కలిసే అవకాశం

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లబోతున్నారు. మెట్రో ఫేజ్ 2 అనుమతుల కోసం ఢిల్లీ వెళ్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ పనులుకు సంబంధించి వారికి విజ్ఞప్తులు చేయనున్నారు. కేరళలో యూడీఎఫ్ ఘన విజయం సాధించగా, స్టార్ క్యాంపెయినర్ గా ఈ విజయంలో రేవంత్ రెడ్డి కూడా కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలతో భేటీ అయ్యే అవకాశముంది. కేరళ విజయానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అభినందించనున్నారు. ప్రస్తుతం కేరళకు కాబోయే సీఎం ఎవరు అనే చర్చ కాంగ్రెస్ పార్టీలో రకరకాల పేర్లు వినిపిస్తున్నాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు కూడా సీఎం రేస్‌లో ప్రధానంగా వినిపిస్తోంది. కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి తాజా ఢిల్లీ పర్యటన ఆసక్తిని రేపుతోంది. మరోవైపు నామినేటెడ్ పదవులపై కూడా చర్చ జరిగే అవకాశముంది.

# మే 10న భాగ్యనగరం సాక్షిగా మోదీ సమర శంఖం

(మొదటిపేజీ తరువాయి)

నినాదాలు రాశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తికా రెడ్డితో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొని క్షేత్రస్థాయిలో పార్టీ ప్రచారాన్ని హోరెత్తించారు. మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తెలంగాణకు వస్తుండటంతో ఈ సభను చారిత్రాత్మకం చేయాలని పార్టీ కృతనిశ్చయంతో ఉంది. ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే, భారతదేశం మాత్రం మోదీ నాయకత్వంలో ప్రగతి పథంలో దూసుకుపోతోందని రామచందర్ రావు అభివర్ణించారు. దేశం సాధిస్తున్న ఈ ఆర్థిక పురోగతిని, సంక్షేమ ఫలాలను తెలంగాణ ప్రజలకు వివరించేందుకే ప్రధాని వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మే 10వ తేదీన పరేడ్ గ్రౌండ్స్ వేదికగా మోదీ ఇచ్చే సందేశం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలకబోతోందని విశ్లేషించారు. ఈ చారిత్రక సందర్భానికి సాక్ష్యంగా నిలవాలని, యావత్ తెలంగాణ సమాజం మోదీకి ఘనస్వాగతం పలకాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను రామచందర్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. 100 సీట్లలో ఓట్ల చోరీ జరిగిందన్న మమత ఆరోపణలను ఆయన ఎద్దేవా చేశారు. "చోరీ చేసే అలవాటు ఉన్నవారే ఇతరులపై అలాంటి నిందలు వేస్తారు. గతంలో చోరీ చేసి గెలిచిన వారికి, ఇప్పుడు తమ ఆటలు సాగకపోవడంతో ప్రజాస్వామ్యంపై గౌరవం పోయింది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజా తీర్పును అంగీకరించలేని స్థితిలో తృణమూల్ కాంగ్రెస్ ఉందని, మమత వ్యాఖ్యలు బెంగాల్ ప్రజల విజ్ఞతను అవమానించడమేనని మండిపడ్డారు. మమతా బెనర్జీ చేస్తున్న నిరాధార ఆరోపణలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మద్దతు తెలపడం విడ్డూరంగా ఉందని రామచందర్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పే సర్వోత్తమమని, దానిని అవమానపరిచేలా మాట్లాడుతుంటే కాంగ్రెస్ వత్తాసు పలకడం ఆ పార్టీ పతనానికి నిదర్శనమని అన్నారు. ఓడిపోయిన ప్రతిసారి ఈవీఎంలను, ఎన్నికల కమిషన్‌ను నిందించడం విపక్షాలకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ప్రజల తీర్పును గౌరవించని ఏ పార్టీ కూడా ప్రజాస్వామ్యంలో మనగడ సాగించలేదని ఆయన హెచ్చరించారు. గతంలో మమతా బెనర్జీ మూడుసార్లు గెలిచినప్పుడు తాము ఏనాడూ ప్రజల తీర్పును శంకించలేదని, హుందాగా గౌరవించామని రామచందర్ రావు గుర్తు చేశారు. కానీ నేడు బీజేపీ ఘనవిజయం సాధిస్తుంటే తట్టుకోలేక ఈసీఐ, దేశ వ్యవస్థలనే నిందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగినప్పుడు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని హితవు పలికారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన కనీస బాధ్యత కూడా మమత, రాహుల్ గాంధీలకు లేకపోవడం దురదృష్టకరమని ఆయన విశ్లేషించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులను విశ్లేషిస్తూ రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. పెద్ద పెద్ద దేశాలే ఆర్థిక వ్యవస్థలను కాపాడుకోలేక ఇబ్బంది పడుతుంటే, మోదీ విజన్ వల్ల భారత్ సురక్షితంగా ఉండటమే కాకుండా వేగంగా వృద్ధి చెందుతోందని అన్నారు. ఈ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా విపక్షాలు ఏకమవుతున్నాయని, కానీ ప్రజలు మాత్రం మోదీ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. తెలంగాణకు అందాల్సిన భారీ ప్రాజెక్టులు, అభివృద్ధి పథకాలపై ప్రధాని తన పర్యటనలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని, అందుకే ఈ సభ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు. ప్రధాని సభను పురస్కరించుకుని హైదరాబాద్ నగరమంతా కాషాయమయమైందని రామచందర్ రావు తెలిపారు. కార్యకర్తలు పోస్టర్లు, ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్ క్యాంపెయిన్‌లతో ప్రతి గడపకూ మోదీ సందేశాన్ని తీసుకెళ్తున్నారని చెప్పారు. తార్నాక నుంచి ప్రారంభమైన ఈ వాల్ రైటింగ్ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ముమ్మరంగా సాగుతోందని వెల్లడించారు. మే 10వ తేదీన పరేడ్ గ్రౌండ్స్ జనసందోహంతో నిండిపోయి, రికార్డు స్థాయి హాజరు నమోదవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# గోవుల అక్రమ రవాణాను నియంత్రించాలి

- గోవులను రక్షించే క్రమంలో చట్టాలను అతిక్రమించ వద్దు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్





**మహా వరంగల్ బ్యూరో;** గోవుల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాలను అతిక్రమించ వద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. మూగ జీవాల అక్రమ రవాణాకు సంబంధించిన నిబంధనలు, చట్టపరమైన అంశాల పై వరంగల్ కమిషనరేట్ పరిధిలోని గో రక్షణ కమిటీలతో వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా మూగ జీవాల అక్రమ రవాణా నియంత్రణ కై తీసుకోవాల్సిన చర్యల పై గో రక్షణ సమితి సభ్యులను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఇందుకు గో రక్షణ సమితి సభ్యులు గోవుల అక్రమ రవాణా పై అవసరమైన సలహాలు సూచనలు పోలీస్ కమిషనర్ కు ఇవ్వడం జరిగింది. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ కమిషనరేట్ పరిధిలో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు గాను వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దుల్లో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతం వాహన తనీఖీలు నిర్వహించబడుతాయని ఇందుకోసం ప్రత్యేకంగా పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని. అదే విధంగా గోవుల అక్రమ రవాణా జరుగుతున్నట్లుగా సమాచారం వుంటే తక్షణే పోలీసులకు సమాచారం అందించాలి కాని గోవులను రక్షించాలనే క్రమంలో గో రక్షణ కమిటీ సభ్యులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని తెలిపారు. ముఖ్యంగా ఇదే సమయంలో అక్రమంగా గోవుల తరలిస్తున్న వాహనాలను అడ్డుకునేందుకు రక్షణ కమిటీ సభ్యులు వాహనాల పై రవాణా చేస్తున్న వాహనాన్ని వెంబడిస్తూ వేగంగా వాహనాలను నడపటం చాలా ప్రమాదకరమని, అలాగే అక్రంగా మూగ జీవాలను తరలిస్తున్న వాహనాలను అడ్డుకునే సమయంలో నిందితులు దాడులకు పాల్పడే అవకాశాలతో పాటు శాంతి భద్రతలు సమస్యలు రావచ్చని, మీరు కూడా ప్రమాదంలో పడే అవకాశాలు వున్నాయని, ఇకపై స్థానికంగా వున్న గో రక్షణ కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లను స్థానిక పోలీసులతో షేర్ చేసుకోవడం ద్వారా నకలీ ఫోన్ కాల్స్‌ను కట్టడి చేయవచ్చని దీని ద్వారా త్వరితగతిన గోవులను రక్షించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మూగ జీవాలను అక్రమంగా తరలించే వారిని పట్టుకోవడం పోలీసుల బాధ్యతని, గోవుల అక్రమ రవాణా పై ఫిర్యాదులు రాగానే స్థానిక పోలీసులు తక్షణమే స్పందించాలని ఇలాంటి చర్యలకు పాల్పడే వారి పై చట్టపరమైన చర్యలు తెసుకోబడుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్‌కుమార్, రాజమహేంద్ర నాయక్, దార కవిత, ట్రైనీ ఐపిఎస్ మనిషా నేహ్రా,ఏసిపిలు జితేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, భీంశర్మ, సతీస్‌బాబు, రవీందర్ రెడ్డితో పాటు ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు, గో రక్షణ, బంజరంగ్, విశ్వహిందు పరిషత్ కు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్‌ను కలిసిన బీజేపీ నాయకులు



**భద్రాచలం మహా :** భద్రాచలానికి నూతనంగా నియమితులైన డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ని ఈరోజు భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, బాధ్యతల స్వీకరణకు అభినందనలు తెలియజేశారు. ప్రాంతంలో చట్టవ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని, సాధారణ ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మారావు, కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రామ్మోహన్ రావు, బోడ సత్యనారాయణ, ముత్యాల చంద్రశేఖర్, ములిశెట్టి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## బూర్గంపాడు పీఏసీఎస్ పాత పాలకవర్గం కొనసాగింపు

**చైర్మన్‌గా బిక్కసాని శ్రీనివాస్ రావుకు కొనసాగింపు – ప్రభుత్వ ఆదేశాలు అమలు**



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS)లో పాత పాలకవర్గాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో, చైర్మన్‌గా బిక్కసాని శ్రీనివాస్ రావు కొనసాగుతున్నారు.ప్రభుత్వ సూచనల మేరకు, PACS చైర్మన్ బిక్కసాని శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నిర్వహణ, రైతులకు అందించే సేవలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.సమావేశంలో మాట్లాడిన చైర్మన్ శ్రీనివాస్ రావు,ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా సంఘం పనితీరు మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు సమయానికి అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పాలకవర్గ సభ్యులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, రైతుల సంక్షేమమే తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ వ్యవసాయ అభివృద్ధికి PACS కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యానికి తోడుగా "నవ లిమిటెడ్" సేవలు అభినందనీయం

- జిల్లా వైద్య శాఖ అధికారి తుకారం రాథోడ్
- నవ లిమిటెడ్ సహకారంతో వాక్సిన్ రూమ్ ప్రారంభోత్సవం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీస్ కార్యక్రమంలో భాగంగా శేఖర్ బంజర అర్బన్ హెల్త్ సెంటర్ నందు నిర్మించిన వాక్సిన్ రూమ్ ను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల కొరకు నిరీక్షణాలయం నిర్మించడం కోవిడ్ సమయంలో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ ను ఏర్పాటు చేయడం ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి "నవ లిమిటెడ్" చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం శేఖర్ బంజర అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ కుమారి మాట్లాడుతూ వాక్సిన్ సమయంలో రోగులు ఎదురుకుంటున్న సమస్యలను "నవలిమిటెడ్" మేనేజ్మెంట్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి మూడు నెలలలోనే వాక్సిన్ రూమ్ ను నిర్మాణం చేసి అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.జి.ఎమ్ సి.హెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ నవలిమిటెడ్ చేస్తున్న ఆరోగ్యం విద్య జీవనోపాదుల కార్యక్రమలను వివరించారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఆర్ మేనేజర్ సి.హెచ్. శ్రీనివాసరావు, సివిల్ ఇంజనీర్ ఫణింద్రచారి, కరుణాకర్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, సి.ఎస్.ఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలు సాగు చేయాలి

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలి
- పంటల విభిన్నీకరణ ప్రత్యామ్నాయ సాగుతోనే రైతులకు ఆర్థిక భరోసా
- నీటి సంరక్షణ పద్ధతులు మిశ్రమ పంటల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి
- ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** రైతులు కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగును విస్తరించుకోవాలని ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని భువన గార్డెన్స్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు "ఉద్యాన పంటల సాగు"పై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పంటల విభిన్నీకరణ అత్యంత ఆవశ్యకమని మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ ఆటోమేషన్ సిరికల్చర్ ఆయిల్ పామ్ స్టాళ్లను ఆయన పరిశీలించి ఆధునిక పద్ధతులపై ఆసక్తిగా ఆరా తీశారు. నీటి సంరక్షణ పద్ధతులు పాటించడం వల్ల సాగు ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని వాతావరణ మార్పులను తట్టుకునే పంటలపై అవగాహన కలిగి ఉండాలని రైతులకు హితవు పలికారు. నిపుణులు వివరించిన సాగు మెళకువలను పాటించి రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుదల వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు క్షేత్రస్థాయిలో వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కిషోర్, ఉద్యాన అధికారి దేవప్రసాద్, హెచ్.ఈ.ఓ వసంత, టిఏసిఎస్ అధ్యక్షులు మండే హనుమంతరావు, ఏఓలు, ఏఈఓలు రైతులు పాల్గొన్నారు.



## డిజిపిని కలిసిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

**మహా వరంగల్ బ్యూరో;** ఇటీవల తెలంగాణ రాష్ట్ర డిజిపిగా నుతనంగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను మంగళవారం హైదరాబాదు లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. డీజీపిని మంగళవారం కలవడం వరంగల్ తూర్పులో రాజకీయంగాను, ఇటు పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



## లబ్ధిదారులకు జాప్యం లేకుండా రుణాలను అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- బ్యాంకర్లతో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ డి ఎల్ ఆర్ సి, డిసిసి సమావేశం

**మహా వరంగల్ బ్యూరో;** ప్రాధాన్యత రంగాలకు అధిక రుణాలను బ్యాంకర్లు జాప్యం లేకుండా అందించాలని, అత్యధికంగా పంట రుణాలను ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో 2025 2026 వార్షిక సంవత్సరానికి గాను బ్యాంకులు ఇచ్చిన రుణాలపై బ్యాంకర్లతో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డి ఎల్ ఆర్ సి ), జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ లబ్ధిదారులకు జాప్యం లేకుండా రుణాలను అందించాలని బ్యాంకర్లకు సూచించారు. రుణ లక్ష్య సాధనకు సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో హనుమకొండ జిల్లా రుణ లక్ష్యం 15484.29 కోట్లు కాగా ఇందులో 13733.74 కోట్ల రుణ లక్ష్యం సాధించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బ్యాంకర్లు పునరుత్పాదక సౌర శక్తి (రెనువబెల్ సోలార్ ఎనర్జీ )కి సంబంధించిన రుణాలు, పీఎంఎఫ్ఎంఈ, అగ్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ సంబంధించిన రుణాలను అధికంగా ఇవ్వాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు అత్యధికంగా రుణాలు అందించడంలో రాష్ట్రస్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చినందుకు డిఆర్డిఏ అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశం అనంతరం మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడంలో తోడ్పాటు అందించిన ఏపీఎంలు, సీసీలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేశారు. నాబార్డ్ పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2026 27ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, యూపీఐ డీజీఎం కమలాకర్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జన్ను మహేందర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, జిల్లాలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నన్ను గెలిపించిన డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిది

- డివిజన్ అభివృద్ధిలో అందరి సహకారం మరువలేనిది
- రూ. 24 కోట్ల నిధులతో డివిజన్ అభివృద్ధి
- 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పనా నవీన్



**మహా వరంగల్ బ్యూరో;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ వారి ఐదు సంవత్సరాల కార్పొరేటర్ పదవి కాలం పూర్తవుతున్న సందర్భంగా డివిజన్ అభివృద్ధి, వారు చేసిన సేవా కార్యక్రమాల పై ప్రైవేట్ హాల్లో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గందకల్పన నవీన్ మాట్లాడుతూ 28వ డివిజన్ అభివృద్ధికి గత బిఆర్ ఎస్ ప్రభుత్వం లోని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ నుండి ప్రస్తుత ప్రభుత్వం లోని మంత్రి కొండా సురేఖ వరకు ఎంతో సహకరించారని ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించిన మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి లకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్లో మొత్తం 24 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా ఇప్పటి వరకు 6 కోట్ల 30 లక్షల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని మిగిలిన అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని వారు తెలిపారు. ముఖ్యంగా స్మార్ట్ సిటీ పనుల కింద డివిజన్లో సీసి రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టు ల నిర్మాణాలు పూర్తి చేసామని అన్నారు. 2021 లో కార్పొరేటర్ గా ఎన్నికైన నాటి నుంచి నేటి వరకు డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా నిస్వార్థంగా పని చేశామన్నారు. డివిజన్లోని మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులతో తాగునీటి పైప్ లేన్ నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, వరదనీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కరోనా సమయంలో తమ సొంత ఖర్చులతో నిత్యవసర సరుకులు అలాగే కరోనా వచ్చిన వారికి వ్యాక్సిన్ లు ఉచిత వైద్య శిబిరాల తో పాటు డివిజన్ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అలాగే డివిజన్ ను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచిన పారిశుద్ధ్య కార్మికుల సేవలను వెలకట్టలేమని వారికి ఈ సందర్భంగా పాదాభివందనం చేశారు. 2023 సంవత్సరంలో పెద్ద ఎత్తున వరదలు వచ్చినప్పుడు రాత్రి 12 గంటల సమయంలో మాతోపాటు అప్పటి మట్టెవాడ ఏసిపి బోనాల కిషన్, మట్టెవాడ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ లు, పోలీస్ బృందంతో పాటు బల్దియా సిబ్బంది సహకారంతో తమ సొంత ఖర్చులతో సహాయక చర్యల్లో భాగంగా జెసిబి లు, ట్రాక్టర్లు, పునరావాస కేంద్రాలు, నిత్యవసర సరకులు అందించి డివిజన్ ప్రజల కష్టాల్లో పాలు పంచుకున్నామని వారు తెలిపారు. ఈ విపత్తు సమయంలో మేయర్ గాని అప్పటి కమిషనర్ గాని ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదని వారు పేర్కొన్నారు. దాదాపు 17 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు వారు తెలిపారు. అంతేకాకుండా డివిజన్లో అంతకుముందు రోడ్లు మరమ్మత్తులు కూడా తమ సొంత ఖర్చులతోనే చేశామని, విపత్తుల సమయంలో హంటర్ రోడ్డు పరిధిలోని సంతోషిమాత కాలనీ, బృందావన్ కాలనీ, సాయి నగర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్ కాలనీల ప్రజలకు సొంత ఖర్చుతో నిత్యవసర వస్తువులు పంపిణీ చేశామన్నారు. ముఖ్యంగా హంటర్ రోడ్ లోని వివిధ కాలనీలు ముంపు గురి కాకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. 28వ డివిజన్ అభివృద్ధికి సహకరించిన ప్రజా ప్రతినిధులు, బల్దియా లోని వివిధ విభాగాల అధికారులకు సిబ్బంది కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ గా ఆశీర్వదించిన డివిజన్ ప్రజల రుణం తీర్చుకున్నామని ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా వరదల నుంచి హంటర్ రోడ్ లోని కాలనీలను ముంపు నుండి తప్పించే దిశగా భద్రకాళి బండ్ పక్కన చేపట్టిన కాలువ నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ గందే కల్పన నవీన్ దంపతులు చేతులెత్తి కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిజెపి వరంగల్ జిల్లా రజక సెల్ కన్వీనర్ కొత్తపెల్లి రాజేష్ , సిద్ధి రాములు, కళ్యాణ్ , అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం







**మహా వరంగల్ బ్యూరో;** రాష్ట్రంలోని రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని,అన్నదాతకు అండగా నిలిచే ప్రభుత్వమనిరాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాను రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాలో రైతులను ఉద్దేశించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూరాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా సందర్భంగా రైతులను ఉద్దేశించి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ మెగా రైతు మేళాకు భారీగా తరలివచ్చిన రైతులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అవసరమైన ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పరికరాలను సబ్సిడీపై అందజేస్తూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ రూ.2 లక్షల పంట రుణమాఫీ, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్, ఎకరాకు రూ.12,000 రైతు భరోసా వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.ఇప్పటివరకు 25 లక్షల మంది రైతన్నలకు 21 వేల కోట్లకుపైగా రైతులకు ప్రభుత్వం రుణమాఫీ సహాయాన్ని అందించి అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి “భూభారతి” వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.“ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక”లో భాగంగా ప్రభుత్వం ప్రజల మధ్యకే వెళ్లి, గ్రామాలు, వార్డుల స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరిస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలు, మెగా రైతు మేళాలు నిర్వహిస్తూ రైతులకు నూతన సాంకేతికతను పరిచయం చేస్తున్నామని పేర్కొన్నారు.రైతుల దీవెనలతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని, ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ఇప్పటివరకు లక్షలాది మంది రైతులకు భారీ స్థాయిలో రుణమాఫీ చేసి అండగా నిలిచినట్లు మంత్రి తెలిపారు. రైతును రాజుగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఎదగడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలే కారణమని చెప్పారు.రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు.ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూడా రైతుల సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారానికి నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలుపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని,ప్రభుత్వం రైతుల వెంటే నిలుస్తుందని భరోసా ఇచ్చారు.“రైతు బలంగా ఉంటేనే రాష్ట్రం బలపడుతుంది. రైతు ఆనందం – ప్రభుత్వ ఆనందం” అని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయం అందిస్తూ, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఆనాడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల సంక్షేమానికి, ప్రాజెక్టుల గురించి కృషి చేశారని, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. గతేడాది అత్యధిక వరి పండిన రాష్ట్రంగా మన రాష్ట్రం నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రైతు సంక్షేమం కోసం క్యాబినెట్లో విస్తృత చర్చ జరిగిందన్నారు. పంటల సాగులో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలని రైతులకు సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. నిరుపేదలు బాగుపడాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా పరిపాలన చేస్తున్నారని అన్నారు.

### ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ...

రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరితపిస్తున్నారని అన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు వరంగల్ వేదికగా మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాను నిర్వహిస్తున్నారని అన్నారు. నాడు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేశారని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేశారని అన్నారు. వరి పండించిన రైతులకు బోనస్ గా 500 రూపాయలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్నారని అన్నారు. రైతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయంలో ప్రోత్సహిస్తున్నారని అన్నారు. సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయం చేస్తేనే కాదు రైతులు సంతోషంగా ఉండే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటును ధరను కల్పించి ప్రతి గింజను కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రాజ్య ప్రభుత్వమని అన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయాన్ని చేసుకునే విధంగా సబ్సిడీ యంత్రాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్టాల్స్ లో ఏర్పాటు చేసిన వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, వ్యవసాయ సంబంధిత అంశాల గురించి రైతులు తెలుసుకోవాలని సూచించారు.

### ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. రైతు రుణమాఫీ చేయడం గొప్ప విషయం అన్నారు. రైతు భరోసా, రైతు బీమా పథకాలను అందిస్తున్నారని అన్నారు. వ్యవసాయ పనిముట్లకు 50% సబ్సిడీ ఇస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులతో ఆధునిక పంటల సాగు విధానం గురించి రైతులు తెలుసుకోవాలని, అదేవిధంగా పంటల మార్పిడి చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ చేయూతగా నిలుస్తుందన్నారు.

### ఘనంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, అధికారులు

రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా నిర్వహిస్తున్న హనుమకొండ లోని ఆర్ట్స్ కళాశాల మైదానం వద్దకు చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ ఎమ్మెల్యేలకు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. మెగా రైతు మేళా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు పుష్పగుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, హాకా మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారులు రవీందర్ సింగ్, రాజమణి, ఉద్యాన శాఖ అధికారి అనసూయ, తదితరులు ఉన్నారు.

### స్టాల్స్ ను పరిశీలించిన మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, ఎంపీ కావ్య

హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన దాదాపు 150 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌ను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు తదితరులు సందర్శించి పరిశీలించారు. స్టాల్స్‌లో ప్రదర్శించిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యంత్ర పరికరాలపై అధికారులు వివరాలు అందించారు. రైతులు స్టాల్స్‌ను ఆసక్తిగా సందర్శిస్తూ, కొత్త సాంకేతికతలు, పథకాలపై సమాచారం తెలుసుకుంటూ ఆకర్షితులయ్యారు.



# తెలంగాణ యువత గమనంలో తమిళనాడు తీర్పు!

నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో ప్రజా తీర్పును తెలంగాణ రాజకీయ పార్టీలు వేటికవే తమకు అనుకూలంగా అన్వయించుకుంటున్నాయి. మన తీర్పు వంతుకు ఇంకా సగం కాలం మిగిలే ఉన్నది. ఆలోగా ఈ ఫలితాల అన్వయంపై మన వద్ద ఎవరి దృక్కోణం, దృక్పథం వారిది. భవిష్యత్ దర్శనంలో అంచనాలకు ఒక ఆలోచన. పశ్చిమ బెంగాల్, కేరళం, తమిళనాడుల్లో అధికార పార్టీలకు చేదు అనుభవమే దక్కింది. పుదుచ్చేరి, అసోం పాలక పక్షాలు తమ పీఠాలను సునాయాసంగా నిలుపుకొన్నాయి. ఆ అయిదింటి ఎన్నికల ఫలితాలతో మన తెలంగాణలోని ప్రధాన పార్టీలు తమకు తాముగానే మురిసిపోతున్నాయి. కేరళంలో కాంగ్రెస్ నేతృత్వ సర్కారుతో మన వద్ద రూలింగ్ కాంగ్రెస్ పార్టీ హ్యాపీ అవుతోంది. తదుపరి ఎన్నికలలోనూ తెలంగాణలో తమదే రాజ్యమని కేరళం జడ్జిమెంటునూ ఆధారం చేసుకుంటోంది. దేవ భూమిగా భాసిల్లే ఆ రాష్ట్రంలో ఎలక్షన్ల ప్రచారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హస్తం పార్టీ నుంచి మరో ముఖ్యమంత్రి ఇప్పుడైతే తోడు కాబోతున్నారు. అసోం రెన్యువల్ సహా పశ్చిమ బెంగాల్ భారీ బోనస్ అవడంతో కమలం కాంతులీనుతోంది.తెలంగాణలోనూ బెంగాల్ రిజల్ట్స్ కోసం బీజేపీ ఆశలు పెంచుకుంటోంది. ప్రధానమంత్రిగా హ్యాట్రిక్ రికార్డు నమోదయ్యాక చాన్నాళ్లకు హైదరాబాద్ కు మోదీ వచ్చే

> **“** *తమిళనాడు తీర్పు, తెలంగాణ యువత గమనంలోకి వేగంగా వస్తున్నది. మన యువత మదిలో అక్కడి తీర్పు గట్టిగా ముద్ర వేస్తోంది. ప్రలోభాల కాలుష్యం లేకుండా స్వచ్ఛంగా, స్వచ్ఛందంగా, నిజాయతీగా విజయ్ టీవీకేను అధికార పీఠం మీద కూచోబెట్టే దాకా తన భుజాన మోసిన తమిళ యువత గొప్ప పాత్ర తెలంగాణ యువత మస్తిష్కంలో రిజిస్టర్ అవుతోంది.*

పదో తేదీన వస్తుండడంతో హుషారవుతున్నది. విజయ్ కొత్త పార్టీ విజయ దుందుభి మాదిరిగానే తమ కొత్త పార్టీకి శుభప్రదమేనని తెలంగాణ రక్షణ సేన ప్రేరణ పొందుతోంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన అయిదింట మూడు చోట్ల రూలింగ్ పార్టీల పరాజయం వలే తెలంగాణలోనూ రాబోయే ఎన్నికలలో చూస్తామన్నది ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి భరోసా. మరీ ముఖ్యంగా తమిళనాట యువత టీవీకే విజయ్ వెంట నడవడంతోనే సరిపెట్టుకోకుండా మహిళలు, పెద్దలనూ నడిపించింది. ఈ పరిణామాన్ని బీఆర్ఎస్ నిశితంగా పరిశీలిస్తోంది. తమ నేత కేటీఆర్ లోనూ అంతకుమించిన ప్రభంజనాన్ని భవిష్యత్ దర్శనం చేస్తోంది. అదే సమయంలో తమిళనాడు తీర్పు తెలంగాణ యువత గమనంలోకి వేగంగా వస్తున్నది. మన యువత మదిలో అక్కడి తీర్పు గట్టిగా ముద్ర వేస్తోంది. ప్రలోభాల కాలుష్యం లేకుండా స్వచ్ఛంగా, స్వచ్ఛందంగా, నిజాయతీగా విజయ్ టీవీకేను అధికార పీఠం మీద కూచోబెట్టే దాకా తన భుజాన మోసిన తమిళ యువత గొప్ప పాత్ర తెలంగాణ యువత మస్తిష్కంలో రిజిస్టర్ అవుతోంది. మన రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని సింహభాగం యువజనుల్లో కేటీఆర్ నాయకత్వంపై ఆశలు, అంచనాలు చాలానే ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలో లేకున్నా కేటీఆర్ కు అదే ఆదరణ లభిస్తుండడం భారత రాష్ట్ర సమితి యంత్రాంగాన్ని ఉత్సాహపరుస్తోంది. సరిగ్గా తమిళనాడుతోపాటు తక్కిన 4 చోట్ల ఎన్నికల ప్రక్రియ జరుగుతున్నపుడే... అదే చెన్నైతోపాటు దేశ వ్యాప్తంగా నెట్వర్క్ ఉన్న స్ట్రీట్ కాజ్ అనే కంప్లీట్ జెన్ జీ ఆర్గనైజేషన్ హైదరాబాద్ లో తలపెట్టిన ఈవెంట్ కేటీఆర్ పట్ల ఉన్న ఆదరణ, గౌరవం, కృతజ్ఞత, గుర్తింపు, ఆమోదం నాడీని పట్టి చూపింది. సుమారు 45 వేల మంది యువతీ యువకుల సమాహారమైన స్ట్రీట్ కాజ్ భాగస్తులు కేటీఆర్ సందేశం, పిలుపు, ఆకాంక్ష, అభిలాషకు తగినట్లుగా పదుగురుకి ఉపాధి ఇచ్చే స్థితికి ఎదిగారు, ఎదుగుతున్నారు. తమ పాలనలో హైదరాబాద్ లో కేటీఆర్ అందుబాటులోకి తెచ్చిన సౌలభ్యాలు, వ్యవస్థలు, అవకాశాల సాభాగ్యాలను యువత తమ అంతరంగ ఆవిష్కరణల్లో వ్యక్తీకరించారు. ఇలాంటివెన్నో అనుకూల అంశాలు యువతను, వారి కుటుంబ సభ్యులు, పెద్దలను తమ పార్టీ వైపు మొగ్గు చూపగలవని భారత రాష్ట్ర సమితి అంచనా కడుతోంది. అసెంబ్లీ పోరుకు మొదటిసారి వచ్చీ రావడంతోనే తమిళనాడులో పట్టు సాధించిన టీవీకే విజయ్ ని ఎన్నికల్లో, ఎన్నికల ముందు రాజకీయ ప్రత్యర్థులు ఎంత బద్నాం చేసినా, ఎన్ని అవరోధాలు సృష్టించినా యువజనులు తన నాయకత్వానికి జై కొట్టారని రుజువైంది. మన వద్ద అదే పనిగా కేటీఆర్ కు ఎన్ని వివాదాలు, ఆరోపణలు, అపవాదులను ఆపాదించినా అవి ప్రజా తీర్పు పవనాల ఉధృతి ముంగిట దూది పింజాల్లా ఎగిరిపోతాయని బీఆర్ఎస్ గట్టిగా విశ్లేషించుకుంటోంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విజయ్ హైదరాబాద్ ప్రగతి భవన్ కు 2022 మే 18న వచ్చారు. నాడు కేసీఆర్ తో భేటీ అయ్యారు. ఆ భేటీ ప్రాముఖ్యతను అపుడు పైకి చెప్పకున్నా...భావి ప్రణాళికలతో రాజకీయ ప్రాధాన్యం ఉన్నట్లు ఇపుడు విదితం అవుతోంది!



- ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, హైదరాబాద్
94408 50384




# విద్యా రంగంలో సరికొత్త విప్లవం...

## బీసీ గురుకులాలు ట్రెండ్ సెట్టర్

## కొలువుల కార్ఖానాలు..సీఎం రేవంత్ రెడ్డి సంస్కరణలతో సూపర్ హిట్

## కార్పొరేట్ దీటుగా క్యాంపస్ ప్లేస్ మెంట్లు



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలకే కొంతమంది అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. వాటిలో విద్యను అభ్యసిస్తే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చనే ఆలోచన. వారి ఆశయం ఆలోచన మంచిదే. కానీ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉన్నత ఉద్యోగాలకు మార్గమన్న అపోహలను చెరిపేస్తూ... బీసీ గురుకులాలు సంచలన విజయాలు నమోదు చేసుకుంటూ దూసుకెళ్తున్నాయి. విద్యారంగంలోనే సరికొత్త విప్లవాన్ని తీసుకొస్తున్నాయి. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన సంస్కరణల ఫలితమే ప్రధాన కారణం. గురుకులాలను ఉద్యోగాల హబ్‌లుగా మార్చేశాయి. ఫైనల్ ఇయర్‌లోనే సగానికి పైగా విద్యార్థులు కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం... ప్రభుత్వ విద్యా వ్యవస్థ తన చిత్తశుద్ధిని చాటుకుంటుంది. పేదల పిల్లలు ఇప్పుడు కార్పొరేట్ రంగంలో దూసుకెళ్తూ... గురుకులాలను దేశానికి మోడల్‌గా నిలబెడుతున్నారు. విద్యారంగంలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు.

“ప్రైవేట్ చదివితేనే ఉద్యోగం” అన్న భావనకు చెక్ పెడుతూ... బీసీ గురుకులాలు కొత్త ట్రెండ్ క్రియేట్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంస్కరణలతో బలోపేతమైన గురుకుల వ్యవస్థ... పేద విద్యార్థులను నేరుగా కార్పొరేట్ రంగంలో నిలబెడుతూ విద్యా రంగంలో గేమ్‌చేంజర్‌గా మారింది.

నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును వెలిగించే కొలువుల కేంద్రాలుగా బీసీ గురుకులాలు నిలుస్తున్నాయి. విద్యా సంస్థలు ఇప్పుడు ఉద్యోగాల ప్రాంగణాలుగా మారుతున్నాయి. మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలలు కార్పొరేట్ స్థాయిలో ప్లేస్మెంట్లు సాధిస్తూ సంచలన విజయాలు నమోదు చేసుకుంటున్నాయి. చదువు పూర్తికాగానే ఉద్యోగం అనే లక్ష్యాన్ని సాకారం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయి

### కార్పొరేట్‌కు పోటీగా గురుకులాలు..

సాధారణంగా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకే పరిమితమైన క్యాంపస్ నియామకాలు ఇప్పుడు ప్రభుత్వ గురుకులాల గడప దాటాయి. డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీ, బీకాం ఇతర కోర్సులు చదువుతున్న ఫైనలియర్ విద్యార్థిని విద్యార్థులు 50 శాతం మంది వివిధ కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫైనల్ ఇయర్ విద్యార్థుల్లో దాదాపు 50 శాతం మంది వివిధ కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం. ఏడు కళాశాలల్లో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌స్‌లో మొత్తం 1,045 మంది విద్యార్థుల్లో 501 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం ఈ విజయానికి నిదర్శనం.

### డిగ్రీ కళాశాలల్లో ప్లేస్మెంట్లు ఇవి..

నిజామాబాద్ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులు 177 మంది ఉండగా 127 మంది హాజరయ్యారు. వివిధ కంపెనీల్లో 115 మంది ఉద్యోగాలు సాధించారు. స్టేషన్ ఘన్పూర్ లో 92 మంది ఉండగా 66 మంది ఇంటర్వ్యూ హాజరయ్యారు. 25 మంది ఉద్యోగాలు సాధించారు. జగదేవ్ పూర్ వర్గల్ కళాశాలలో 292 మంది విద్యార్థులు ఉండగా, 243 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. 185 మంది ఉద్యోగాలు సాధించారు. హైదరాబాదులోని మేడ్చల్ కళాశాలలో 296 మంది విద్యార్థులకు 296 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 150 మంది ఉద్యోగాలు సాధించారు. ఖమ్మం కళాశాలలో 149 మంది విద్యార్థులు ఉండగా 21 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. 11 మంది ఉద్యోగాలు సాధించారు. నిర్మల్ కళాశాలలో 26 మంది విద్యార్థులు ఉండగా ఆరుగురు ఇంటర్వ్యూ కు హాజరయ్యారు. ఇందులో నలుగురు ఉద్యోగాలు సాధించారు.

### వర్గల్ కళాశాల.. విజయానికి నాంది..

మెదక్ జిల్లా వర్గల్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన బీసీ గురుకుల డిగ్రీ మహిళా కళాశాల దేశానికి ఆదర్శంగా నిలిచింది. అకడమిక్ ఫలితాల్లోనే కాదు, ప్లేస్మెంట్లలోనూ అగ్రగామిగా నిలుస్తోంది. 292 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థుల్లో 243 మంది క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరై, వారిలో 185 మంది ఉద్యోగాలు సాధించడం గొప్ప రికార్డు. ఈ ఫలితాలే తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో డిగ్రీ కళాశాలల విస్తరణకు మార్గం సుగమం చేశాయి.

### మొదటి సంవత్సరం నుంచే నైపుణ్యాల పెంపు..

గురుకులాల్లో విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించే దిశగా మొదటి సంవత్సరం నుంచే ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ ట్రైనింగ్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై దృష్టి సారించడం వల్లే విద్యార్థులు ఇంటర్వ్యూల్లో అత్యుత్తమ ప్రతిభ చాటుతున్నారు. తద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. బీసీ గురుకుల సొసైటీ లక్ష్యం స్పష్టంగా ఉంది. డిగ్రీ పూర్తి చేసే సమయానికి ప్రతి విద్యార్థి ఉద్యోగం పొందాలి లేదా ఉన్నత విద్యలో మంచి సీటు సాధించాలి. ప్రస్తుతం 30 కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అదే దిశగా శిక్షణ ఇస్తున్నారు.


### సివిల్స్ లక్ష్యంగా కొత్త ప్రణాళికలు..

ఇకపై గురుకుల విద్యార్థుల లక్ష్యం మరింత విస్తరించనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సివిల్స్‌పై ఆసక్తి ఉన్న వారికి ఫస్ట్ ఇయర్ నుంచే ప్రత్యేక కోచింగ్ ఇవ్వాలని సొసైటీ ప్రణాళికలు రూపొందిస్తోంది. దీంతో గ్రామీణ, బడుగు వర్గాల విద్యార్థులకు కొత్త అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి.

### సీఎం రేవంత్ రెడ్డి సంస్కరణల ఫలితమే విజయం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలు, గురుకుల వ్యవస్థకు ఇచ్చిన ప్రాధాన్యం ఈ విజయాల వెనుక ప్రధాన కారణం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో తీసుకొచ్చిన వినూత్న కార్యక్రమాలు గురుకులాలను దేశంలోనే ఆదర్శంగా నిలిపాయి. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇప్పుడు పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం సామాజిక మార్పుకు నిదర్శనం.

గతంలో కేవలం విద్యకే పరిమితమైన గురుకులాలు ఇప్పుడు “కొలువులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతున్నాయి. మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల సొసైటీ సాధించిన ఈ విజయాలు తెలంగాణ విద్యా రంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తున్నాయి. బడుగు వర్గాల పిల్లలు ప్రభుత్వ గురుకులాల్లో చదివి కార్పొరేట్ స్థాయిలో ఉద్యోగాలు సాధించడం నిజంగా గర్వించదగ్గ పరిణామం. గురుకులం అంటే ఇక చదువు మాత్రమే కాదు... భవిష్యత్తుకు భరోసా.. ఈ విద్యార్థుల ముందు ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు బలాదూరే..



- గొట్టిముక్కుల బ్రహ్మాచారి
9441884389

# యుద్ధాలు ప్రాంతీయమే.. పర్యావరణ విధ్వంసం ప్రపంచానికి...

తరచుగా వివిధ దేశాల మధ్య జరిగే ప్రాంతీయ యుద్ధాలు బాంబుదాడులు సైనిక చర్యల ద్వారా అడవులు, చెరువులు (వెట్‌ల్యాండ్స్), వ్యవసాయ భూములను నాశనం చేసి తీవ్రమైన పర్యావరణ నష్టాన్ని కలిగిస్తాయి. పేలుళ్లు, రసాయన ఆయుధాల వాడకం గాలి, మట్టి, నీటిలో విషపూరిత పదార్థాలను విడుదల చేసి దీర్ఘకాలిక కాలుష్యానికి దారితీస్తుంది. చమురు లీకులు, ఇంధన నిల్వల దహనం గాలి, సముద్ర కాలుష్యాన్ని గణనీయంగా పెంచుతాయి. వన్య ప్రాణుల నివాసాలు దెబ్బతిని, జంతువులు వలస వెళ్లాల్సి వస్తుంది లేదా అంతరించిపోవచ్చు. భారీ యంత్రాల వినియోగం, భూ సొరంగాల వల్ల మట్టి నాణ్యత క్షీణించి వ్యవసాయ ఉత్పాదకత తగ్గుతుంది. నీటి వనరులు కలుషితమై మనుషులు, జంతువులకు అనారోగ్యకరంగా మారుతాయి. యుద్ధాలు పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలను బలహీనపరచి సహజ వనరుల అక్రమ వినియోగానికి దారితీస్తాయి. యుద్ధానంతర పునర్నిర్మాణం ఇప్పటికే నష్టపోయిన పర్యావరణంపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది. యుద్ధ సమయంలో పెరిగే హరిత గృహ వాయువుల ఉద్గారాలు వాతావరణ మార్పులను మరింత తీవ్రతరం చేస్తాయి.

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు (1914-1918 మరియు 1939-1945) విపరీతమైన దీర్ఘకాలిక పర్యావరణ నష్టాన్ని కలిగించాయి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో, నేలలో గోతుల (ట్రెంచ్) యుద్ధాలు మాత్రమే యూరప్‌లో విస్తారమైన భూభాగాలను నాశనం చేశాయి; ఇవి వృక్ష సంపదను నాశనం చేసి, మట్టిని గట్టిపరచి, నేలక్షీణత (ఎరోషన్)ను వేగవంతం చేశాయి. అలాగే క్లోరిన్, మస్టర్డ్ గ్యాస్ వంటి రసాయన ఆయుధాల వినియోగం మట్టి, నీటి వ్యవస్థలను విషపూరితం చేసి, భూమిని అనేక సంవత్సరాల పాటు నిరుపయోగంగా మార్చింది. చారిత్రక విశ్లేషణల ప్రకారం, లక్షల హెక్టార్ల అడవులు సైనిక అవసరాల కోసం నరికివేయబడి, నివాస ప్రదేశాల నష్టం, జీవ వైవిధ్యం తగ్గుదలకు దారితీశాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో, పరిశ్రమల ఆధారిత యుద్ధ విధానాల వల్ల పర్యావరణ నష్టం మరింత పెరిగింది; బాంబు దాడులు యూరప్, ఆసియా అంతటా పర్యావరణ వ్యవస్థలను ధ్వంసం చేశాయి. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP) అంచనాల ప్రకారం, యుద్ధాలు పర్యావరణ వ్యవస్థలను భంగం చేసి, నీటి వనరులను కలుషితం చేసి, సహజ వనరులను తగ్గిస్తాయి, వీటి ప్రభావాలు తరతరాల పాటు కొనసాగుతాయి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో మునిగిపోయిన నౌకల వల్ల సముద్రాలలో 15 మిలియన్ టన్నులకుపైగా చమురు విడుదలై దీర్ఘకాలిక సముద్ర కాలుష్యాన్ని కలిగించింది. హిరోషిమా, నాగాసాకిపై అణుబాంబు దాడులు సుమారు 4000□C ఉష్ణోగ్రత, వికిరణాన్ని సృష్టించి, వెంటనే వృక్షజాలం మరియు జంతుజాలాన్ని నాశనం చేసి, దీర్ఘకాలిక రేడియోధార్మిక కాలుష్యాన్ని మిగిల్చాయి. సైన్స్ డైరెక్ట్ పరిశోధనల ఆధారంగా 193 గ్లోబల్ కేస్ స్టడీల సమీక్ష ప్రకారం, యుద్ధాలు సాధారణంగా అడవుల నాశనం, మట్టి క్షీణత, పర్యావరణ వ్యవస్థల కుప్పకూలుటకు దారితీస్తాయి. అదనంగా, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం నివేదికలు ప్రపంచ జీవ వైవిధ్య హాట్‌స్పాట్లలో రెండు మూడవ వంతుకంటే ఎక్కువ ప్రాంతాల్లో సాయుధ ఘర్షణలు జరిగినట్లు సూచిస్తూ, సంరక్షణ వ్యవస్థలకు తీవ్ర ముప్పు ఉందని చెబుతున్నాయి.

వివిధ ఖండాల్లో జరిగిన ప్రధాన ప్రాంతీయ యుద్ధాలు విస్తృత స్థాయి పర్యావరణ నష్టాన్ని కలిగించాయి. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి , ప్రకృతి సంరక్షణ కోసం అంతర్జాతీయ సంఘం , శాస్త్రీయ జర్నల్స్ నివేదికలు స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. ఆసియాలో, వియత్నాం యుద్ధం (1961-1975) అత్యంత అధ్యయనం చేయబడిన ఉదాహరణలలో ఒకటి. ఈ యుద్ధంలో సుమారు 11-20 మిలియన్ గ్యాలన్ల వరకు ఏజెంట్ ఆరెంజ్ వంటి హెర్బిసైడ్లు పిచికారీ చేయబడి, లక్షల హెక్టార్ల అడవులు, మాంగ్రోవ్ అరణ్యాలు, జీవ వైవిధ్యాన్ని నాశనం చేశాయి. సుమారు 366 కిలోల వరకు విషపూరిత డయాక్సిన్ విడుదలై, దశాబ్దాల తర్వాత కూడా పర్యావరణంలో నిలిచింది. పరిశోధనలు చూపించిన ప్రకారం, పిచికారీ చేసిన అడవుల్లో పక్షుల జాతులు 24 వరకు మాత్రమే ఉండగా, ప్రభావం లేని ప్రాంతాల్లో 150కు పైగా ఉన్నాయి. మధ్యప్రాచ్యంలో, 1991 గల్ఫ్ యుద్ధం అత్యంత భయంకరమైన పర్యావరణ విపత్తులలో ఒకటిగా నిలిచింది. ఇందులో 6-8 మిలియన్ బారెల్ల చమురు ఉద్దేశపూర్వకంగా పర్షియన్ గల్ఫ్‌లోకి విడుదల చేయబడింది. సుమారు 700 చమురు బావులను కాల్చివేయడం వల్ల భారీ సముద్ర, గాలి కాలుష్యం ఏర్పడింది. ఈ ఘటనలు తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలు, మత్స్య సంపద, మరియు గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీశాయి. యూరప్‌లో, 1990ల బాల్కన్ యుద్ధాల సమయంలో పరిశ్రమలపై బాంబుదాడులు జరిగి, డాన్యూబ్ వంటి నదుల్లో విషపూరిత రసాయనాలు చేరి, నీటి వనరులు, వ్యవసాయ భూములు కలుషితమయ్యాయి. ఆఫ్రికాలో, సూడాన్ , కాంగో వంటి ప్రాంతాల్లో జరిగిన అంతర్గత యుద్ధాలు పరిపాలన బలహీనత కారణంగా అడవుల నాశనం, వన్యప్రాణుల నష్టం, సహజ వనరుల అక్రమ వినియోగాన్ని పెంచాయి. ఇటీవలి కాలంలో, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అడవులు, వ్యవసాయ భూములు, నీటి మౌలిక సదుపాయాలను విస్తృతంగా దెబ్బతీసి కాలుష్యాన్ని, హరిత గృహ వాయువుల ఉద్గారాలను పెంచింది. నిపుణులు ఈ ప్రభావాలను “ఎకోసైడ్” (పర్యావరణ నాశనం)గా పేర్కొంటున్నారు. అలాగే, పశ్చిమ ఆసియాలోని ఘర్షణలు నీటి వనరులు, పట్టణ పర్యావరణ వ్యవస్థలను ధ్వంసం చేసి పర్యావరణ ఒత్తిడిని మరింత పెంచాయి. ఆహార మరియు వ్యవసాయ సంస్థ ప్రకారం, ప్రపంచ ఆహార భద్రత లోపంలో 40% కంటే ఎక్కువకు యుద్ధాలు కారణమవుతున్నాయి, ఎందుకంటే వ్యవసాయ భూములు విడిచిపెట్టబడటం లేదా క్షీణించడం జరుగుతుంది. అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ నివేదికల ప్రకారం, సుమారు 60% యుద్ధాల్లో నీటి వ్యవస్థలు దెబ్బతిని, శుద్ధమైన నీటి అందుబాటును తగ్గించి, జల జీవవ్యవస్థలకు హాని కలిగిస్తున్నాయి. నివేదికలు సూచిస్తున్నట్లుగా, పర్యావరణ పునరుద్ధరణ చాలా మందగంగా జరుగుతుంది లేదా పూర్తిగా జరగదు; కొన్ని పర్యావరణ వ్యవస్థలు తిరిగి పునరుద్ధరించడానికి దశాబ్దాలు లేదా శతాబ్దాలు పడుతుంది.

ప్రాంతీయ యుద్ధాల ప్రభావాల నుండి సహజ వనరులను రక్షించడానికి అనేక ప్రపంచ సదస్సులు, కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన మానవ పర్యావరణ సదస్సు సాయుధ ఘర్షణలు తీవ్రమైన పర్యావరణ నష్టాన్ని కలిగిస్తాయని మొదట గుర్తించి, గ్లోబల్ చర్యలకు పునాది వేసింది. ఎర్త్ సమ్మిట్ ద్వారా రూపొందించిన అజెండా 21 సుస్థిర వనరుల నిర్వహణపై దృష్టి పెట్టి, ఘర్షణలు పర్యావరణ వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీస్తాయని పేర్కొంది. వరల్డ్ సమ్మిట్ ఆన్ సస్టైనబుల్ డెవలప్మెంట్ ప్రకారం, 1960 తర్వాత జరిగిన ఘర్షణల్లో సుమారు 40% సహజ వనరులతో సంబంధం ఉన్నాయని, ఘర్షణలకు గురయ్యే ప్రాంతాల్లో పర్యావరణ వ్యవస్థలను రక్షించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించింది. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం ప్రకారం, ప్రధాన సాయుధ ఘర్షణల్లో 60% కంటే ఎక్కువ జీవ వైవిధ్య సమృద్ధి గల ప్రాంతాల్లో జరుగుతుండటంతో పర్యావరణ ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 2016లో సహా అనేక తీర్మానాలను ఆమోదించి, యుద్ధాల సమయంలో పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరాన్ని గుర్తించింది. అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ ప్రకారం, సుమారు 50-60% ఘర్షణల్లో నీటి మౌలిక వసతులు దెబ్బతిని, పర్యావరణం, మానవ జీవనానికి తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్యారిస్ ఒప్పందం ప్రత్యక్షంగా యుద్ధాలపై కాకపోయినా, సుస్థిర వనరుల వినియోగం, వాతావరణ స్థిరత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా ఘర్షణ ప్రభావిత ప్రాంతాలకు మద్దతు ఇస్తుంది. అంచనాల ప్రకారం, పర్యావరణ పునరుద్ధరణ నష్టం తీవ్రతపై ఆధారపడి 10 నుంచి 50 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ సమయం పట్టవచ్చు.

ప్రాంతీయ యుద్ధాల నుండి పర్యావరణ వనరులను రక్షించడం కోసం చట్టపరమైన, సంస్థాగత సాంకేతిక చర్యల సమన్వయం అవసరం. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఉన్న అంతర్జాతీయ చట్టాలను కఠినంగా అమలు చేసి, యుద్ధ సమయంలో పర్యావరణ నాశనాన్ని నిషేధించాలి. అరణ్యాలు, తడిబయళ్లు, జలవనరులు వంటి కీలక పర్యావరణ వ్యవస్థలను రక్షించేందుకు దేశాలు బలమైన ఒప్పందాలను కుదుర్చుకోవాలి. సైనిక చర్యలకు ముందు, తరువాత పర్యావరణ ప్రభావ అంచనాలు తప్పనిసరిగా నిర్వహించాలి. రసాయన ఆయుధాల వంటి హానికరమైన ఆయుధాల వినియోగాన్ని పూర్తిగా నిషేధించి, అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ వంటి గ్లోబల్ సంస్థల ద్వారా పర్యవేక్షించాలి. స్వచ్ఛమైన నీటి అందుబాటును పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడేందుకు నీటి మౌలిక వసతులను రక్షించడం అత్యంత కీలకం. యుద్ధానంతర పర్యావరణ పునరుద్ధరణ కార్యక్రమాలకు తక్షణమే నిధులు కేటాయించి అమలు చేయాలి. ఉపగ్రహ పర్యవేక్షణ, ఆధునిక సాంకేతికత ద్వారా పర్యావరణ నష్టాన్ని తక్షణం గుర్తించవచ్చు. స్థానిక సమాజాలను సంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. యుద్ధ సమయంలో సహజ వనరుల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు బలమైన పరిపాలన, అవినీతి నిరోధక చర్యలు అవసరం. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వంటి సంస్థల ద్వారా గ్లోబల్ సహకారం, అవగాహన పెంపొందించడం ద్వారా దీర్ఘకాలిక పర్యావరణ స్థిరత్వం మరియు శాంతిని సాధించవచ్చు.




- డాక్టర్. పి.ఎస్.చారి
83090 82823

# సింగరేణి యాజమాన్యానికి ఏఐటీయూసీ హెచ్చరిక

కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి.. లేనిపక్షంలో అన్ని సంఘాలతో కలసి ఉద్యమం..



## సామాజిక సేవకుడు ఉపేందర్ కు సన్మానం..

### ఆయన సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శం..

**మణుగూరు, మహా :** సమాజ సేవలో ముందుండి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఆర్టీసీ కండక్టర్ చెరుకుపల్లి ఉపేందర్‌రావును బీసీ టైమ్స్ అండ్ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ఎక్స్ డీజీపీ పూర్ణచంద్రరావు చేతుల మీదుగా ఉపేందర్‌రావుకు చిరు సత్కారం నిర్వహించారు. మణుగూరులో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపేందర్‌రావు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన విషయం విధితమే. కాగా వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, మహిళలను గౌరవించాలనే నినాదంతో మహిళా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించడం, పర్యావరణ పరిరక్షణ-భావితరాల సంరక్షణ లక్ష్యంగా మట్టి గణపతులను పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో చైతన్యం నింపుతున్న విషయం తెలిసిందే. సన్మాన సభ వేదికపై కొందరు వక్తలు మాట్లాడుతూ.. వనజీవి రామయ్య ఆశయ సాధనలో భాగంగా నిరంతరం మొక్కలు నాటడం, వాటి సంరక్షణ కార్యక్రమాలను చేపట్టి అందరికీ ఉపేందర్ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. చిరు ఉద్యోగి అయినప్పటికీ సమాజం పట్ల నిబద్ధతతో తనకు చేతనైన సహాయం చేస్తూ ముందుకు సాగుతున్న ఉపేందర్‌రావు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ టైమ్స్ అండ్ సమాజ్ జనరల్ సెక్రటరీ కొల్లు అర్జున్, బీసీ టైమ్స్ ఆర్గనైజర్ సంఘం సూర్యారావు తదితరులు పాల్గొని ఉపేందర్‌రావును అభినందించారు.




## సొసైటీ అధ్యక్షుడుగా బాలాజీ బాధ్యతల స్వీకరణ

**నేలకొండపల్లి, మహా:** మండలం లోని చెరువు మాదారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ధీరావత్ బాలాజీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..రైతులకు సేవ చేసేందుకు మరో అవకాశం ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. సొసైటీ పరిధి లోని రైతులకు అన్ని వేళలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగాపురం తండా సర్పంచ్ ధీరావత్ అశోక రాణి, చెరువు మాదారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు ఘనంగా సన్మానించారు.

## టిబీజీకేఎస్ చొరవతో..

- కార్మికులకు గ్యాస్ సరఫరా..
- హెచ్‌పీ సేల్స్ అధికారి పవన్‌కు నాగెల్లి కృతజ్ఞతలు..

**మణుగూరు, మహా :** మణుగూరు సింగరేణి ఏరియాలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల సరఫరా అంతరాయం కలగడంతో ఇబ్బందులు పడుతున్న కార్మిక కుటుంబాలకు టిబీజీకేఎస్ చొరవతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. దీనిపై తెలంగాణ రాష్ట్ర హిందుస్థాన్ పెట్రోలియం సేల్స్ అధికారి పవన్‌కు ఏరియా టిబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, మణుగూరు ఏరియాలో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న కార్మికుల కుటుంబాలకు గ్యాస్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ సమస్యను తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర హెచ్‌పీ సేల్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కార్మిక కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లు అందించడం అభినందనీయమన్నారు.సింగరేణి కాలరీస్ కంపెనీ కోఆపరేటివ్ ఏజెన్సీ ద్వారా ఏరియాకు వచ్చిన డొమెస్టిక్ సిలిండర్ల పంపిణీలో జరిగిన అవకతవకల వల్ల కార్మిక కుటుంబాలు మానసికంగా ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించారు. ఇందుకు కారణమైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఇళ్లకు గ్యాస్ సరఫరా చేస్తామని చెప్పి, వారి రిజిస్ట్రేషన్ నంబర్లు తీసుకుని కొందరు సిలిండర్లు డ్రా చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం విజ్ఞప్తిపై అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ ముందుకు వచ్చి కార్మికులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం సంతోషకరమని నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌పీ అధికారులు, అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఐటీసీ పీఎస్‌పీడీ వద్ద ఉద్రిక్తత

### 14వ వేతన ఒప్పందంపై ఐఎన్టీయూసీ ధర్నా, నాయకుల అరెస్టు

**బూర్గంపహాడ్ మహా ఫ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ వద్ద కార్మిక సంఘాల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. 14వ వేతన ఒప్పందంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఐఎన్టీయూసీ (INTUC) నాయకులు ఐటీసీ గేటు ముందు భారీ ధర్నాకు దిగగా, పోలీసులు జోక్యం చేసుకుని నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

**42 రోజులుగా నిరసనలు**

కార్మికులు మరియు మిత్రపక్షాల నాయకులు గత 42 రోజులుగా 14వ వేతన ఒప్పందం అమలుపై రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ సమస్యలకు పరిష్కారం కనిపించకపోవడంతో, ఐఎన్టీయూసీ నాయకులు గేటు ముందు ప్రత్యక్ష ఆందోళన చేపట్టారు. "కార్మికుల జీవితాలు తాకట్టు" - ఐఎన్టీయూసీ ఆరోపణ ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు మాట్లాడుతూ:14వ వేతన ఒప్పందం కార్మికులకు అన్యాయం చేసే విధంగా ఉందన్నారు.ఈ ఒప్పందంతో కార్మికుల భవిష్యత్తు, వారి కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.టీఎన్టీయూసీ మరియు ఐటీసీ యాజమాన్యం కలిసి కార్మికుల ప్రయోజనాలను పక్కన పెట్టాయని ఆరోపించారు. ఐటీసీ గేటు ముందు మిత్రపక్షాల నాయకులతో కలిసి:14వ వేతన ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారుకార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారుఈ క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో, పోలీసులు జోక్యం చేసుకుని పలువురు నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని ఐఎన్టీయూసీ నేతలు ఆరోపించారు. అరెస్టులతో మా గొంతు మూయలేరు" అరెస్టులపై స్పందించిన ఐఎన్టీయూసీ నాయకులు:కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు

## నిరంతర విద్యుత్ సరఫరాపై కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ పార్టీ నాయకుల విమర్శ
- విద్యుత్ సబ్ స్టేషన్ ముందు నిరసన




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజలకు రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. పాల్వంచలో విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయం తీరుపై మంగళవారం పాల్వంచ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించి నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి రోజుకు 15 నుండి 20 సార్లు కరెంట్ ఆఫ్ చేసి ప్రజలను రైతులను వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కరెంటు కోతలు లేకుండా నాణ్యమైన కరెంటు అందించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటలు కరెంటు ఇచ్చిన ఘనత కెసిఆర్కే దక్కుతుందన్నారు. తక్షణం ప్రభుత్వ శాఖ అధికారులు స్పందించి పాల్వంచకి నిరంతర విద్యుత్తును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, మల్లెల రవిచంద్ర, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్ మూర్తి, ముత్యాల ప్రవీణ్, కార్పొరేటర్ గుగులోత్ రాంబాబు, కార్పొరేటర్ గుణ చరిత్, కాల్వ ప్రకాష్, పత్తిపాటి శ్రీను, జూపెల్లి దుర్గాప్రసాద్, బట్టు మంజుల, కిలారు చిన్న, కొంచెర్ల రామకృష్ణ, చందు నాయక్, నారికట్ల శేఖర్, దాసరి సురేష్, హర్ష, వీరన్న, ఆనంద్, శంకర్, నాయుడు, నాగసత్యం, చంద్రశేఖర్, చింతలచెరువు దుర్గాప్రసాద్, ఆనంద్, ఫిరోజ్, సంపత్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పదో తరగతి ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక సప్లమెంటరీ క్యాంపులు

### జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఇంటర్ పదో తరగతి ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక సప్లమెంటరీ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపులు, పాఠశాలల మౌలిక సదుపాయాలు, అలాగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ చేపడుతున్న పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలను సేకరించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. భద్రాచలం, పాల్వంచ, చంద్రుగొండలో నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపుల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని సమీక్షించి ప్రతి విద్యార్థి ఈ క్యాంపులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 13 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఈ తరగతుల ద్వారా విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి హాజరు అభ్యాస పురోగతిపై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం కూడా సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని మండలాలు పాఠశాలల వారీగా ఫెయిల్ విద్యార్థుల వివరాలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్యాంపుల ద్వారా విద్యార్థుల లోపాలను గుర్తించి లక్ష్యబద్ధంగా బోధన చేపట్టి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని పాఠశాలల్లో వివిధ దశల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించిన కలెక్టర్ అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుదీకరణ వంటి మౌలిక వసతులు 100 శాతం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 12 నుండి విద్యాశాఖ ద్వారా చేపట్టబడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అధికారులు తమ మండలాల్లో చేపడుతున్న చర్యలపై వివరాలు తెలియజేయగా కలెక్టర్ తగిన సూచనలు చేశారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడం దిశగా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## సొసైటీ చైర్మన్ గా కొమ్మినేని బాధ్యతలు స్వీకరణ

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ గా కొమ్మినేని పాండు రంగారావు మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పు మేరకు ఇప్పటివరకు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సనల్ ఇంచార్జ్ గా వ్యవహరించిన శ్రీనివాసరావు నుండి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్లు చైర్మన్ పాండురంగారావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తామని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా విత్తనాలు ఎరువులు సకాలంలో అందే విధంగా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ నరసింహారావు, డైరెక్టర్లు ఎల్లంకి సత్యనారాయణ, చాపలమడుగు రామ్మూర్తి, లాకావత్ హేమ్లా,



రెడ్డి బోయిన రాము, పాపిన్ని వెంకయ్య, తిరువెంగళరావు, శిరంశెట్టి రామారావు, భూక్య జవహర్లాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ రోజు చర్ల పీఏసీఎస్ చైర్మన్ గా తిరిగి బాధ్యతలు స్వీకరించిన పరుచూరి రవి కుమార్...

**చర్ల మహా :** గతంలో పీఏసీఎస్ పాలక వర్గముల పదవీ కాలం ముగిసిన అనంతరం పాలక వర్గం స్థానంలో కో ఆపరేటివ్ శాఖ అధికారులను పర్సన్ ఇన్ ఛార్జ్ గా నియమించడం జరిగింది. పీఏసీఎస్ లకు పర్సన్ ఇన్ చార్జిగా అధికారుల నియకమును సవాల్ చేస్తూ కొంతమంది పీఏసీఎస్చైర్మన్ లు ఉన్నత న్యాయస్థానమునకు వెళ్లగా..న్యాయస్థానము విచారించి అట్టి పర్సన్ ఇన్ ఛార్జ్ ల నియామకమును రద్దు చేయడం జరిగినది.రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం పీఏసీఎస్ లకు నూతన పాలక వర్గమును నామినేట్ చేయు వరకు పీఏసీఎస్ ల రోజు వారి నిర్వహణ,ధాన్యం సేకరణ,జీతాల చెల్లింపు వంటి విధులు నిర్వహించుటకు గాను ఇబ్బందులు తలెత్తకుండా పాత పాలక వర్గమును బాధ్యతలు చేపట్టమని అధికారుల ద్వారా ప్రభుత్వము కోరిన మీదట ఈ రోజు చర్ల PACS పాలక వర్గము బాధ్యతలు చేపట్టడం జరిగింది...



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి..


- రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి..
- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి – చర్ల పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్



**చర్ల మహా :** చర్ల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సత్యనారాయణపురం గ్రామంలోని పెద్దపల్లి-ముమ్మిడివరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం పరిమాణం, కొనుగోలు ప్రక్రియ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలిస్తూ టార్పాలిన్లు, హమాలీలు, తాగునీరు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాన్ని తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయడానికి తగినన్ని లారీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం నష్టపోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ట్యాబ్ ఎంట్రీలను ఆలస్యం లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.

అనంతరం సత్యనారాయణపురం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. కాకర్లపూడి విజయలక్ష్మి పూర్తి చేసిన ఇల్లు, చినిగిరి రాజు రూఫ్ స్థాయిలో ఉన్న ఇల్లు, కారం నాగరాజు స్లాబ్ దశలో ఉన్న ఇల్లు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పునాది నుంచి స్లాబ్ వరకు ప్రతి దశలో ఇంజనీరింగ్ ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతపై సమీక్ష నిర్వహిస్తూ లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సిమెంట్, ఇసుక, ఇనుము వంటి నిర్మాణ సామగ్రి నాణ్యంగా ఉండేలా చూడాలని, పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామంలో మంజూరైన 27 ఇళ్లలో 25 ఇళ్లు వివిధ దశల్లో కొనసాగుతుండగా, మిగిలిన ఇళ్లకు గ్రౌండింగ్ వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు నాణ్యమైన గృహ వసతి కల్పించడమే లక్ష్యమని, పనులు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు మరియు మౌలిక సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. మేటర్నిటీ వార్డు, డయాలసిస్ కేంద్రం, మందుల నిల్వగది, వంటగది, అవుట్ పేషెంట్ విభాగం తదితర విభాగాలను సందర్శించి సేవల నాణ్యతను తనిఖీ చేశారు.

ఓపీ విభాగంలో చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మందుల నిల్వలను పరిశీలించి అవసరమైన ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా స్టాక్ నిర్వహణను క్రమబద్ధీకరించాలని సూచించారు. రోగులకు అందించే ఆహారం నాణ్యతపై దృష్టి సారిస్తూ శుభ్రతతో కూడిన పోషకాహారం అందించాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో 108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి అత్యవసర సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకుని, సమయానికి స్పందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రిలో త్రాగునీటి కొరత ఉన్నట్లు గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి నిరంతర నీటి సరఫరా కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, శుభ్రత, మౌలిక సదుపాయాలు అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, గృహ నిర్మాణ శాఖ ఏ ఈ ముకేశ్ ,ఏ ఓ లావణ్య, మిషన్ భగీరథ ఏఈ లు అరుణ్,రాము, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెంట్ డాక్టర్ సాయి వర్ధన్, డాక్టర్లు రాంప్రసాద్, రవికుమార్, తిరుపతిరావు, జాన్ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## నివాసయోగ్యం లేని సింగరేణి క్వార్టర్లపై చర్యలు..

- 10 ఖాళీ సింగరేణి కూల్చివేత..
- అక్రమ నివాసితులకు 2 రోజుల గడువు

**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియా పీవీ కాలనీలో నివాసయోగ్యం లేని సింగరేణి కంపెనీ క్వార్టర్లపై యాజమాన్యం చర్యలు ప్రారంభించింది. హౌస్ అలాట్‌మెంట్ కమిటీ సభ్యులైన సింగరేణి అధికారులు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు మంగళవారం కాలనీలో పర్యటించి దెబ్బతిన్న క్వార్టర్ల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా నివాసయోగ్యం కాని క్వార్టర్లను కమిటీ సభ్యులు గుర్తించారు. ఖాళీగా ఉన్న 10 క్వార్టర్లను తక్షణమే కూల్చివేశారు. అలాగే మిగిలిన శిథిలావస్థకు చేరిన క్వార్టర్లలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి, రెండు రోజుల్లోగా ఖాళీ చేయాలని హెచ్చరించారు. అక్రమంగా ఆక్రమించుకున్న క్వార్టర్లకు విద్యుత్, నీటి సరఫరాను నిలిపివేశారు. గడువు ముగిసిన అనంతరం ఆ క్వార్టర్లను కూడా పూర్తిగా కూల్చివేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా నివసిస్తున్న వారు వెంటనే క్వార్టర్లను ఖాళీ చేయాలని సింగరేణి యాజమాన్యం తరపున ఏజీఎం పర్సనల్ ఎస్ రమేశ్ స్పష్టం చేశారు.

## కోర్టు తీర్పుతో..


- సొసైటీ చైర్మన్‌గా మళ్లీ నాగేశ్వరరావుకు బాధ్యతలు..
- మణుగూరు పిఏసీఎస్ సభ్యుల పదవీ స్వీకారం..

**మణుగూరు, మహా :** కోర్టు తీర్పు ఆధారంగా మణుగూరు వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కుర్రి నాగేశ్వరరావు మరోసారి బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ ఎన్నికల నేపథ్యంలో వచ్చిన న్యాయస్థాన తీర్పు మేరకు చైర్మన్ పదవిని కొనసాగించేందుకు ఆయన మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడైన కుర్రి నాగేశ్వరరావు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించగా, వైస్ చైర్మన్‌గా మోహన్‌రావు పదవిలో కొనసాగారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, సభ్యులు నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. సొసైటీ అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని నాగేశ్వరరావు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సునీల్, రాఘవులు, ఆకిన సతీష్, వట్టం రాంబాబు, అప్పారావు, పిన్నమనేని మాధవి, కుంట లక్ష్మణ్, శ్రీను, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఆ వార్తల్లో నిజం లేదు: కియారా

“టాక్సిక్’ సినిమాలో నా పాత్రకు సంబంధించి వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. అవన్నీ పుకార్లు మాత్రమే” అంటున్నారు హీరోయిన్ కియారా అద్వానీ. ‘కేజీఎఫ్, కేజీఎఫ్ 2’ వంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత యశ్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియా చిత్రం ‘టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్’. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఈ మూవీ తెరకెక్కింది. కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, నయనతార, తారా సుతారియా, రుక్మిణీ వసంత్ హీరోయిన్లుగా నటించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ, యశ్ నిర్మించిన ఈ మూవీ ఇంగ్లిష్, కన్నడ భాషల్లో నేరుగా, తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో డబ్బింగ్ వెర్షన్‌లో రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే... ఈ సినిమాలో కథకి అవసరం మేరకు యశ్, కియారాల మధ్య కొన్ని బోల్డ్ సీన్స్ చిత్రీకరించారట గీతూ మోహన్‌దాస్. అయితే ఫైనల్ కట్ చూసిన తర్వాత ఆ సన్నివేశాలను తొలగించాలని కియారా కోరారనే వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఈ వార్తలపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు కియారా అద్వానీ. “టాక్సిక్’ మూవీలో నా పాత్రకు సంబంధించి వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదు. ఈ మూవీ స్క్రిప్ట్ విషయంలో నేను ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. అదే విధంగా నాపై ఉన్న కొన్ని సీన్స్ తొలగించమని యూనిట్‌ని కోరాననే వార్తలు కూడా అవాస్తవం. అవన్నీ కేవలం నిరాధారమైన పుకార్లు మాత్రమే” అని స్పష్టం చేశారు కియారా. ఇదిలా ఉంటే.. మార్చి 19న రిలీజ్ కావాల్సిన ‘టాక్సిక్’ జూన్ 4కి వాయిదా పడింది. అయితే ఆ తేదీకి కూడా రిలీజ్ కావడం లేదంటూ యశ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.







# ‘జన నాయగన్’కి శాపమే వరమైంది.. కనక వర్షం గ్యారెంటీ!

ఏది జరిగినా మన మంచికే అనుకునే మనసు ఉంటే...ప్రతి కష్టం ఒక పాఠం అవుతుంది... ప్రతి ఓటమి ఒక అవకాశంగా మారుతుంది. ఇప్పుడు దళపతి విజయ్ విషయంలో ఇదే జరిగింది. ఎన్నికల ముందు ఆయనకు వరుస ఇబ్బందులు ఎదురయ్యాయి. భార్య సంగీతతో విడాకులు వివాదం.. మరోవైపు ప్రచారంలో తొక్కిసలాటలు, ఇంకోవైపు తన చివరి చిత్రం విడుదల వాయిదా పడడం.. ఇవన్నీ తట్టుకొని అలుపెరగకుండా ప్రచారం చేసి.. చివరకు రాజకీయ ప్రభంజనం సృష్టించాడు. తమిళనాడు రాష్ట్రానికి ఆయన సీఎం అయ్యే అవకాశముంది. ఒకవేళ అదే జరిగితే ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత విడుదలవుతున్న ఏకైక సినిమా ‘జన నాయగన్’ కాబట్టి.. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురవడం కూడా ఖాయమే.



### ఆలస్యమే ఆమృతం..

ఆలస్యం అయితే అమృతం కూడా విషం అవుతుందంటారు. నిజమే కానీ ‘జన నాయగన్’ విషయంలో మాత్రం ఆలస్యమే అమృతం అయ్యేలా ఉంది. ఈ ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కావాల్సింది. కానీ పలు కారణాలతో వాయిదా పడింది. ఎన్నికల ముందు రిలీజ్ అయితే.. కొంతవరకు పొలిటికల్ కెరీర్‌కి కూడా ప్లస్ అవుతుందని విజయ్ భావించాడు. కానీ అది జరగలేదు. వాయిదా పడడమే కాదు.. అందులోని కొన్ని సన్నివేశాలు కూడా లీకయ్యాయి. ఓటీటీ బిజినెస్ కూడా చేజారిపోయింది. ఇక జన నాయగన్ రిలీజ్ అవుతుందో లేదో అని చాలా మంది అనుకున్నారు. కానీ నిన్నటి ఫలితాలు అందరి అంచనాలను తలకిందులు చేసింది. 108 స్థానాల్లో టీవీకే పార్టీ గెలిచి.. ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. విజయ్ సీఎం అయిన తర్వాత జననాయగన్ విడుదల అవ్వడం ఖాయం. అప్పుడు ఈ సినిమాకు వచ్చే హైప్, క్రేజ్ వేరే లెవెల్ ఉంటుంది.

### బాక్సాఫీస్ షేక్ అవ్వాల్సిందే..

ఎన్నికల ముందు రిలీజ్ అయి ఉంటే..టాక్‌ని బట్టి కలెక్షన్స్ ఉండేవి. హిట్ టాక్ వస్తే కానీ ఈ సినిమా భారీ కలెక్షన్స్ వచ్చేవి. కానీ ఇప్పుడు టాక్‌తో సంబంధం లేదు. సినిమా ఎలా ఉన్నా.. తొలి మూడు రోజులు థియేటర్స్ కిక్కిరిసిపోతాయి. సీఎం సినిమా కాబట్టి.. ప్రభుత్వం నుంచి కావాల్సిన అనుమతులన్నీ వచ్చేస్తాయి. ఎన్నికల ముందు ఎలా ఉండేదో కానీ..ఇప్పుడు మాత్రం బాక్సాఫీస్ షేక్ అవ్వడం ఖాయం. ఈ సినిమాతో భారీగా నష్టాలు తప్పవని భావించిన కేవీఎన్ సంస్థ ఇప్పుడు ఊపిరిపీల్చుకుంది. మొన్నటిదాక జన నాయగన్‌కి శాపంగా మారినవన్నీ ఇప్పుడు వరంగా మారాయి. మరి ఈ చిత్రం ఎన్ని రికార్డులను బద్దలు కొడుతుందో చూడాలి.

# కాన్స్ సందడి షురూ

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సందడి మొదలైంది. ఈ నెల 12 నుంచి 23 వరకు ఫ్రాన్స్ వేదికగా 79వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. ప్రస్తుతం ఈ ఫెస్టివల్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రధాన పోటీ విభాగాలకు దక్షిణ కొరియా సినీ దర్శకుడు పార్క్ చాన్-వూక్ జ్యూరీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఇక రెండు దశాబ్దాలుగా క్రమం తప్పకుండా ఈ చిత్రోత్సవాలకు హాజరవుతున్న ఐశ్వర్యా రాయ్ ఈ ఏడాది కూడా హాజరు కానున్నారని తెలిసింది. అలాగే గత ఏడాది తొలిసారి ఈ ఫెస్టివల్‌కు హాజరైన ఆలియా భట్ ఈ ఏడాది కూడా వెళ్తారని బాలీవుడ్ సమాచారం. ‘ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా’ ప్రస్తుత డైరెక్టర్ అశుతోష్ గోవారీకర్, బాలీవుడ్ దర్శక-నిర్మాత కరణ్ జోహార్ వెళ్లనున్నారని తెలిసింది. పంజాబీ సినిమా ‘చర్దికలా’, మలయాళం సినిమా ‘బాలన్: ది బాయ్’ వంటి భారతీయ సినిమాలు ఈ చిత్రోత్సవాల్లో ప్రదర్శితం కానున్న నేపథ్యంలో ఈ సినిమా యూనిట్ సభ్యులు ఈ ఫెస్టివల్‌కు హాజరవుతారు. ఇక కాన్స్‌ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితం కానున్న తొలి పంజాబీ సినిమాగా ‘చర్దికలా’ నిలిచింది. అమ్మీ విర్క్, రూపి గిల్, హిమ్మత్ సంధు లీడ్ రోల్స్‌లో ఈ సినిమాను అమర్‌జిత్ సింగ్ సరోన్ దర్శకత్వంలో పింకీ ధాలివాల్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 29న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. అంటే... కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శన అనంతరం ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల అవుతుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com